ప్రజాశక్తి
శనివారం 13 సెప్టెంబర్ 2025 8 పేజీలు




ప్రకాశం బాపట్ల



కలెక్టర్ రాజ బాబు

నేడు కలెక్టర్ రాజ బాబు బాధ్యతల స్వీకరణ

ఏర్పాట్లు చేసిన అధికారులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా 39వ కలెక్టర్ పి.రాజ బాబు శనివారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు కలెక్టర్‌గా పనిచేసిన ఏ.తమీమ్ అన్సారియా గుంటూరు జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయిన సంగతి తెలిసిందే. కలెక్టర్ పి.రాజబాబు 2013 బ్యాచ్(ఎపి కేడర్)కు చెందిన ఐఎఎస్ అధికారి. గతంలో ఆయన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శిగా పనిచేశారు. ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ముఖ్య కార్య నిర్వహణాధికారిగా పనిచేశారు. ఆంధ్ర ప్రదేశ్ గృహ నిర్మాణ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, కృష్ణా జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. అనంతరం గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేశారు. ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా పి.రాజబాబు శనివారం బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు.

జడ్పీలో పింఛన్ల రగడ

- అర్హులకు పెన్షన్లు తొలగిస్తారా..?
- వైసిపి ఎమ్మెల్యేల ధ్వజం
- డిఆర్‌డిఏ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరిక
- సాదాసీదాగా జడ్పీ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు శివప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశంలో పింఛన్ల రగడ చోటు చేసుకుంది. దర్శి, యర్రగొండపాలెం నియోజకవర్గాలలో సుమారు 6 వేల అర్హులైన వికలాంగులు, వితంతువులు, వితంతువులు పెన్షన్లు ఎలా తొలగిస్తారని వైసిపి ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. అర్హులైన వారికి పింఛన్లు ఇవ్వాలని లేకపోతే లబ్ధిదారులతో కలసి డిఆర్‌డిఏ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని, కోర్టుకెళతామని వారు హెచ్చరించారు. జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన పాత జడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగింది. సమావేశంలో దర్శి శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం శాసన సభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్, డిఆర్‌ఒ బి.చిన ఓబులేసు, జడ్పీ సిఈఒ బి.చిరంజీవి, బాపట్ల ఇన్‌చార్జ్ జెసి జి.గంగాధరగౌడ్ పాల్గొన్నారు. సమావేశంలో ప్రధానంగా పంచాయతీరాజ్, డి ఆర్ డి ఏ, విద్యుత్, రోడ్లు – భవనాలు, వైద్య, వ్యవసాయ శాఖల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై చర్చించారు.

2896 పెన్షన్లు ఎలా తొలగిస్తారు..?

యర్రగొండపాలెం నియోజకవర్గంలో అర్హులైన 2896 పెన్షన్లు ఎలా తొలగిస్తారని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ధ్వజమెత్తారు. ఇదే విషయాన్ని మంత్రి ఓఎస్‌డికి, సెర్ప్ సిఇఒకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. నియోజకవర్గంలోని యడవల్లికి చెందిన నారాయణమ్మ(73) మంచంపై లేవలేని స్థితిలో ఉంటే ఆమె పింఛన్ తొలగించారని పత్రికలలో వచ్చిన ఫొటోను చూపించారు. వికలాంగత్వం 70 శాతం ఉంటే 40 శాతానికి ఎలా తగ్గిస్తారని ప్రశ్నించారు. గతంలో ▶ 2లో



పామూరులోని సుందరయ్యభవన్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

అవినీతి ఎస్‌ఐని సస్పెండ్ చేయాలి

3లో ▶

మంచికలపాడులో మద్యపాన నిషేధం

గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం

3లో ▶

'టిడ్కో' లోన్లు కట్టొద్దు..

త్వరలో రద్దు చేస్తాం..

- ఒంగోలు అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..
- విమర్శలు మాని సూచనలు చేయండి..
- నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్
- 60 అంశాలలో 60 ఆమోదం 4 అంశాలు వాయిదా
- 2 అంశాలపై డిసెంట్ ఇచ్చిన వైసిపి కార్పొరేటర్



సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ సూర్యనారాయణ



మాట్లాడుతున్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

'గత ప్రభుత్వం టిడ్కో ఇళ్లు కేటాయించిన వారికి ఆటోమేటిక్‌గా లోన్లు ఇచ్చినట్లు చూపించారు.. దీని వల్ల ఇల్లు తీసుకోకుండానే అనేకమందికి బ్యాంకు నోటీసులు వచ్చాయి.. ప్రస్తుతం ఎవరూ లోన్లు కట్టాల్సిన అవసరం లేదు.. త్వరలో మా ప్రభుత్వం లోన్లన్నీ పూర్తిగా రద్దు చేస్తుంది' అని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ స్పష్టం చేశారు.

శుక్రవారం నాడు డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఒంగోలు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌన్సిల్ ఎజెండాలో అత్యధిక అంశాలు అభివద్ధి పనులకు సంబంధించినవే వున్నాయని, ఇది అభివృద్ధి పట్ల తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఒంగోలు నగరాన్ని సుందర నగరంగా మార్చాలనే దృఢ సంకల్పంతో ముందుకు వెళుతుందని, అందుకు కావాల్సిన సూచనలు ఇస్తే స్వీకరిస్తామని, అలా కాకుండా కేవలం రాజకీయాల కోసం విమర్శలు చేస్తే తగిన విధంగా స్పందిస్తామని చెప్పారు.

జనాభా పెరుగుదలకు అనుగుణంగా రోడ్ల విస్తరణ

నగర జనాభా పెరుగుదల ▶ 3లో

గాడి తప్పిన పోలీసు

- ఇష్టారీతిన వ్యవహరిస్తున్న కొందరు పోలీసులు
- బదిలీలు చేసినా మారని తీరు



ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

- నిందితుడు, బాధితుడు తేడా లేకుండా వసూళ్లకు పాల్పడుతుండటంతో నాగులుప్పలపాడు ఎస్‌ఐపై బదిలీ వేటు వేశారు.

- పుల్లలచెరువు ఎస్‌ఐ పోలీసుస్టేషన్‌ను సెటిల్మెంట్ అడ్డాగా మార్చేశారన్న ఆరోపణలతో అతనిని కూడా ఉన్నతాధికారులు బదిలీ చేశారు.

- పెద్దారవీడు ఎస్‌ఐపై అవినీతి ఆరోపణలు రావడంతో అతనిని వీఆర్‌కు పంపించారు.

- తాజాగా సిఎస్.పురం ఎస్‌ఐ లంచం వసూళ్ళను ప్రశ్నించిన సిపిఎం నాయకుడిని పోలీసుస్టేషన్‌లో చొక్కా పట్టుకోవడం అత్యంత వివాదాస్పదమైంది.

జిల్లాలో కొందరు పోలీసు అధికారులు వ్యవహరిస్తున్న తీరుకి ఈ ఘటనలు కొన్ని ఉదాహరణలు మాత్రమే. దాదాపు జిల్లాలోని అనేక పోలీసు స్టేషన్లలో పరిస్థితి ఇలాగే వుంది. బయటకు వచ్చిన వాటికంటే బయటకు రాని విషయాలు ఇంకా చాలా వున్నాయి.

ప్రత్యేక వ్యవస్థలా ఏర్పాటు

ఎక్కువ పోలీస్‌స్టేషన్లలో బాధితులు కేవలం ఫిర్యాదు చేస్తే సరిపోదు. చర్య తీసుకోవడానికి అదనంగా ఇంధనం కూడా సమర్పించాల్సిన దుస్థితి ఏర్పడింది. దీని కోసం స్టేషన్‌లో కొందరు సిబ్బందిని ప్రత్యేకంగా నియమించుకోవటం ప్రస్తుతం నడుస్తున్న ట్రెండ్. వీరు ఒక వైపు బాధితులతో, మరో వైపు నిందితులతో లాబీయింగ్ నడుపుతారు. కేసు విచారణ వీరు ఇచ్చే 'ఫీడ్ బ్యాక్' ఆధారంగానే ముందుకు సాగే పరిస్థితి వుంది. దీంతో పాటు కొందరు బయటి వ్యక్తులను కూడా మధ్యవర్తులుగా ఈ వ్యవహారాల కోసం ఏర్పాటు చేసుకుంటున్న సందర్భాలు అనేక చోట్ల ఉన్నాయి.

ప్రజాసంఘాల ప్రతినిధులపై కఠిన వైఖరి

గతంలో ప్రజాసంఘాల నాయకులు బాధితుల పక్షాన ▶ 3లో

జడ్పీలో పింఛన్ల రగడ

(మొదటిపేజీ తరువాయి)

70 శాతం వికలాంగత్వం ఉందని సర్టిఫికెట్ ఇచ్చిన వైద్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు. తమను ప్రజలు గెలిపించారని, టిడిపి ఇన్‌ఛార్జిల వద్దకు వెళ్ళాల్సిన అవసరం లేదన్నారు. పెన్షన్ల ఇచ్చే విషయంలో పార్టీలు చూడవద్దని లబ్ధిదారులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని, అవసరమైతే కోర్టుకెళ్లి అధికారులపై చర్యలు తీసుకునేలా చేస్తామన్నారు.

వికలాంగులు పెన్షన్‌కు అర్హులు కారా .?

దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి

వికలాంగులు, వితంతువులు, వృద్ధులు ప్రభుత్వం నుంచి పెన్షన్లు పొందటానికి అర్హులు కారా.? అని దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ప్రశ్నించారు. నియోజకవర్గంలో 3 వేలు పింఛన్లు తొలగించారని, అదేమని అడిగితే అధికారులు నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని చెప్పారు. ఇదే విషయమై చీమకుర్తి, వెలిగండ్ల జడ్పీటిసిలు వేమా శ్రీనివాసరావు, గుంటక తిరుపతిరెడ్డి, కస్తూరిరెడ్డి, పామూరు ఎంపిపి డాక్టర్ లక్ష్మి ప్రశ్నించారు. డిఆర్‌డిఎ పీడీ నారాయణ స్పందిస్తూ అర్హులందరికీ పెన్షన్లు వస్తాయని, మెడికల్ రీ అసెస్మెంట్ జరుగుతోందని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చని తెలిపారు. డిఎంహెచ్‌ఒ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో సదరం క్యాంపులు నిర్వహిస్తామని, ఇందుకు సంబంధించిన సమాచారాన్ని ప్రజాప్రతినిధులకు ముందుగానే తెలియజేస్తామని హామీ ఇచ్చారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

జిల్లా సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని జెడ్పి చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పిలుపునిచ్చారు. ప్రస్తుతం జిల్లాలో వ్యవసాయ సంబంధిత పనులు ఊపందుకుంటున్నాయని రైతులకు మరింత ప్రయోజనం కలిగేలా వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులు ప్రత్యేక దష్టి సారించాలని ఆమె సూచించారు. అర్హులైన వికలాంగులకు పెన్షన్లు తొలగిస్తుంటే వారు ఇబ్బందులు పడుతున్నారని, చీమకుర్తి మండలంలో బతికి ఉన్న మహిళ చనిపోయినట్లు చూపించి పెన్షన్ తొలగించటం బాధ కలిగించిందన్నారు. అర్హులైన వికలాంగులు, వితంతువులు పింఛన్లు మంజూరు చేయాలని కోరారు.

యూరియా కోసం ఎదురు చూస్తున్న రైతులు


నియోజకవర్గంలో వ్యవసాయ పనులు ఊపందుకోవడంతో యూరియా కోసం రైతులు ఎదురుచూస్తున్నారని దర్శి శాసనసభ్యులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సమావేశం దృష్టికి తెచ్చారు. యూరియా పక్కదారి పట్టకుండా రైతులకు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలోని రైతులకు అవసరమైన పూర్తిస్థాయిలో ఎరువులు, యూరియా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దని, నిర్దిష్ట ధరలకే వారికి లభించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎరువుల వినియోగంపై రైతులకు నిపుణులతో అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు.

కాలువలపై ప్రత్యేక దష్టి

నియోజకవర్గంలో ఇటీవల కురిసిన వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహించాయని, ఈ నీరు స్వేచ్ఛగా పారేలా కాలువలను శుభ్రం చేయించడంపై ప్రత్యేక దష్టి సారించాలని యర్రగొండపాలెం శాసనసభ్యులు అధికారులను కోరారు. దోర్నాలలోని గండి చెరువు నుంచి నీరు లీకు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోర్నాల సామాజిక ఆరోగ్య కేంద్రంలో జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్, చిన్న పిల్లల వైద్యులు లేరని, శ్రీశైలం ముఖద్వారమైన ఈ ఆసుపత్రిలో వైద్య సేవలు ఎలా అందుతాయని ప్రశ్నించారు. దోర్నాల ఆసుపత్రిలో నీటి సమస్య కూడా నెలకొందన్నారు. యర్రగొండపాలెం ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ లేదని అధికారుల దష్టికి తెచ్చారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని ఇతర మండలాల నుంచి యర్రగొండపాలెం కేంద్రానికి అనుసంధానమైన రోడ్లలో మరమ్మతు పనులను వేగవంతం చేయాలని ఆయన కోరారు. ఇతర జడ్పిటిసిలు, ఎంపిపిలు రోడ్ల విషయంలో స్థానిక సమస్యలను అధికారుల దష్టికి తీసుకువచ్చారు. స్థానికంగా జరుగుతున్న మరమ్మతు పనుల పురోగతిని, శాఖ పరంగా తీసుకుంటున్న చర్యలను ఆర్ అండ్ బి అధికారులు వివరించారు.

జ్వరాలు ప్రబలకుండా చర్యలు

జిల్లాలోని పలు మండలాల్లో ప్రజలు ఎక్కువగా జ్వరాలతో బాధపడుతున్నారని వైసిపి శాసనసభ్యులు, పలువురు జడ్పీటిసిలు, ఎంపిపిలు ప్రశ్నించారు. డిఎంహెచ్‌ఒ డాక్టర్ టివెంకటేశ్వర్లు మాట్లాడుతూ జ్వరాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో స్వయంగా తాను పర్యటించి పరిస్థితిని పరిశీలించినట్లు తెలిపారు. ప్రత్యేకంగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని, అవసరమైన మందులు పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులలో అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి అందజేయాలని ఎమ్మెల్యేలు, జడ్పీటిసిలు కోరారు. ట్రాన్స్‌కో ఎస్‌ఇ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2024 ఆగస్టు వరకు ఇచ్చామని, త్వరలోనే మిగిలిన వారికి అందజేస్తామన్నారు. ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలలో చేసిన తీర్మానాలను సర్వసభ్య సమావేశం ఈ సందర్భంగా ఆమోదించింది. సమావేశంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా జడ్పీటీసీలు, ఎంపీపీలు, అన్ని శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



ఉద్యోగ బాధ్యతలు స్వీకరిస్తున్న అబ్దుల్ రవూఫ్

మార్కాపురం అటవీశాఖ

డిప్యూటీ డైరెక్టర్‌గా అబ్దుల్ రవూఫ్

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా అబ్దుల్ రవూఫ్ శుక్రవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. శ్రీశైలంలో సబ్ డిఎఫ్ఒగా శిక్షణ పూర్తి చేసుకొని మార్కాపురంలో డిప్యూటీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఇప్పటి వరకు డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేసిన సందీప్ కృపాకర్ అటవీ శాఖ రాష్ట్ర కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

రిజిష్టర్ డాక్యుమెంటు పోయినది

పెద్దదోర్నాల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన కటికల శ్రీనివాసరావు, తండ్రి: నరసింహారావునకు చెందిన పెద్దదోర్నాలలోని స్థలానికి సంబంధించిన రిజిష్టర్ డాక్యుమెంటు పోయినది. డ్యాకుమెంటు నెం: 3961/2007. జిరాక్స్ తీయించు కునేందుకు తిమ్మాపురం నుండి పెద్దదోర్నాలకు వస్తుండగా మార్గమధ్యలో పోయినది. వెతికినా కనిపించలేదు. ఎవరికైనా దొరికిన యెడల తమకు అందజేయగలరు.

కటికల శ్రీనివాసరావు
సెల్: 8317572673.

మహారాజశ్రీ
మార్కాపురం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. 633/2023

పిక్కిలి చిన్న వెంకటయ్య అలియాస్ వెంకటయ్య .... వాది
వర్సెస్
1) దుగ్గెంపూడి వెంకటేశ్వర్లు మరియు నలుగురు ఇతరులు .... ప్రతివాదులు
టు,
దుగ్గెంపూడి సుబ్బమ్మ, భర్త: వెంకటేశ్వర్లు,
నివాసం: చింతల అగ్రహారం గ్రామం,
దోర్నాల మండలం, ప్రకాశం జిల్లా.

పైనెంబరు దావాను వాది, ప్రతివాదులపై స్వాధీన ఖరారు రిజిష్టరు కొరకు కోర్టులో దావా వేయగా, నీకు ఎన్ని పర్యాయములు దావా సమనులు జారీ చేసిననూ ముట్టని కారణంగా కోర్టు వారు పేపరు ప్రకటన కొరకు ఉత్తర్వులు జారీ చేసినారు. కావున నీవు స్వయంగా కానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టులో తేదీ: 26-09-2025 ఉదయం 10:30 గంటలకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేని యెడల మీపరోక్షమందు కేసు తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 26-09-2025

ఇ.శారద,
అడ్వకేట్, మార్కాపురం.

మహారాజ శ్రీ పొదిలి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No. 674/2025,
I.A.No. 675/2025,
I.A.No. 676/2025,
I.A.No.14/2024
In
O.S.No. 111/2020

మన్నం వెంకట నారాయణ ... వాది
వర్సెస్
మన్నం రామయ్య మరియు వగైరాలు ... ప్రతివాదులు
టు,
R29) నారాయణ లక్ష్మీదేవి,
భర్త లేట్ శ్రీ రంగనాయకులు,
R30) నారాయణ మధులత,
తండ్రి లేట్ శ్రీ రంగనాయకులు,
R31) నారాయణ నరేంద్ర,
తండ్రి లేట్ శ్రీ రంగనాయకులు,
R32) నారాయణ శ్రీ సాయిరంగనాథ్,
తండ్రి లేట్ శ్రీ రంగనాయకులు, పై వారందరూ
R/o. గొట్లగట్టు గ్రామం, కొనకనమిట్ల మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబర్ దావా తేది : 22-09-2025 దిన మీ నోటీసు కొరకు ఉన్నది. కావున పై నెంబర్ దావా యందు మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల తేది :22-09-2025 న ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేక లాయర్ గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచొ మీపరోక్షమును తీర్మానించ బడునని మీకు ఇందుమూలముగా తెలియ జేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తరువులు మేరకు //

తేది : 12-09-2025.
వాయిదా తేది: 22-09-2025.

ఇట్లు.
వరికూటి నాగరాజు, B.com.,B.L.,
వాది తరుపున అడ్వొకేట్,
పొదిలి, ప్రకాశం జిల్లా.
సెల్ నెంబర్: 89855 63337
94401 40498.

ఒంగోలు రెండవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
AS No : 47/2023

Between
కారంశెట్టి వెంకట చలపతిరావు వగైరాలు ..... అప్పిలెంట్లు
పంచాగ్నుల రాధ వగైరాలు ... రెస్పాండెంట్లు
To
R5) కురుగంటి హేమలత @ శారద
భర్త సుకుమార్, నివాసం :601,
ఇంద్రాణి ఎస్టేట్స్ 4th ల్యాండ్
అన్నవరప్పాడు, ఒంగోలు
R8) పి.శిరీష, భర్త మాలంపాటి ఆదినారాయణరెడ్డి
డోర్ నెంబర్ 58-5-5,సంతపేట,ఒంగోలు

పై నెంబరు అప్పీలు నందు మీకు నోటీసు జారి నిమిత్తం వాయిదా తేది:07-10-2025కి ఉన్నది కావున మీరు ఆ రోజున ఉదయం 10.30 నిమిషాలకి పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన వలెయను లేని యెడల మీ పరోక్షమున అప్పీలు తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయ డమైనది

// కోర్టు వారి అనుమతితో //

ఇట్లు
అడుసుమల్లి రామయ్య
అడ్వకేట్, ఒంగోలు

మహారాజశ్రీ ఒంగోలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EP No : 33/2025
OS No : 106/2021

Between
కోటపాటి వెంకటనారాయణ ....డి.హెచ్.ఆర్
మరియు
జెట్టి వెంకట శ్రీనివాసరెడ్డి ...జె.డి.ఆర్
To
జెట్టి వెంకట శ్రీనివాసరెడ్డి,
తండ్రి వెంకటసుబ్బారెడ్డి ,వయస్సు 40 సంవత్సరాలు, నివాసము : ధీరజ్ అపార్ట్ మెంట్ ఫ్లాట్ నెంబర్ 104, మూడో లైను, భాగ్యనగర్, ఒంగోలు. ప్రకాశం జిల్లా

పైనెంబర్ EPలో కోర్టు వారు నీకు నోటీసులు పంపగా నీవు తీసుకొనక కాలయాపన చేయుచున్నావు కావున కోర్టు వారు నీకు నోటీసు నిమిత్తం తేది : 08-10-2025కు వాయిదా వేసియున్నరు ఆరోజు ఉదయం 10.30 నిమిషాలకి పైకోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేదా ఏజెంట్ ద్వారా గానీ పైకోర్టు వారి ఎదుట హాజరై నీకు గల ఆక్షేపణలు తెలుపుకొన వలెయను లేనియెడల నీపరోక్షమున తీర్మానించ బడునని తెలియజేయడమైనది

ఇట్లు
పెల్లూరు రామకృష్ణ
అడ్వకేట్,ఒంగోలు

మహారాజశ్రీ
మార్కాపురం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ. 115/2025
ఇన్
ఓ.ఎస్. 87/2016

జమ్మిగుంపుల వెంకట శివక్రిష్ణ ....ప్రపోజ్డ్ పార్టీ
వర్సెస్
1) జమ్మిగుంపుల రామయ్య (చనిపోయారు)
2) జమ్మిగుంపుల పిచ్చయ్య,
చనిపోయినందున వారసులు.......... రెస్పాండెంట్స్
టు,
ఆర్-7). జమ్మిగుంపుల పెద్ద నాగయ్య,
తండ్రి: రామయ్య
ఆర్-8). జమ్మిగుంపుల చిన్న నాగయ్య,
తండ్రి: రామయ్య
ఆర్-9). జమ్మిగుంపుల సుబ్బమ్మ,
భర్త: కోటయ్య
ఆర్-10). అయినేని ఆదినారాయణమ్మ,
భర్త: వెంకటేశ్వర్లు
అందరి నివాసం : జమ్మిదోర్నాల గ్రామం, పెద్దదోర్నాల మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు ఐ.ఎ. 115/2025 ప్రపోజ్డ్ పార్టీ 3వ వాదిగా పై కేసులో చేర్చుటకు పిటీషను దాఖలు చేయగా, కోర్టు వారు మీకు నోటీసులు ఎన్నిసార్లు జారీ చేసిననూ ముట్టని కారణం చేత పేపరు ప్రకటన కొరకు ఉత్తర్వులు జారీ చేసినారు. కావున తేదీ: 19-09-025న ఉదయం 10:30 గంటలకు మీరు పై కోర్టులో స్వయముగా కానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా: 19-09-2025

ఇ.శారద,
అడ్వకేట్, మార్కాపురం.

అవినీతి ఎస్‌ఐని సస్పెండ్ చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె. మాబు - పామూరు సుందరయ్య భవన్ సెంటర్‌లో నిరసన

ప్రజాశక్తి - పామూరు

అవినీతికి పాల్పడుతున్న ఎస్‌ఐ వెంకటేశ్వర నాయక్, పోలీస్‌స్టేషన్‌లో అంతా తానై అక్రమ వసూళ్లు చేస్తున్న కానిస్టేబుల్ చంద్ర నాయక్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా నాయకుడు ఊసా వెంకటేశ్వర్లుపై ఎస్‌ఐ వెంకటేశ్వర నాయక్, కానిస్టేబుల్ చంద్ర నాయక్ దాడిని ఖండిస్తూ సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కె. మాల్యాద్రి అధ్యక్షతన స్థానిక సుందరయ్య భవన్ సెంటర్‌లో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ సిఎస్‌పురం ఎస్‌ఐ వెంకటేశ్వర నాయక్, కానిస్టేబుల్ చంద్రనాయక్ తోడుగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. వినాయక చవితి పండుగకు అన్ని అనుమతులు ఉచితమని, వాడవాడలా పండగ జరుపుకోవాలని ప్రభుత్వం చెబితే ఎస్‌ఐ మాత్రం వినాయక విగ్రహం ఏర్పాటుకు రూ.2 వేలు, డీజే వినియోగిస్తే రూ.20 వేలు, పాట కచేరి ఏర్పాటు చేస్తే రూ.40 వేలు ఇలా ప్రతిదానికి ఓ రేటు నిర్ణయించి అక్రమాలకు పాల్పడ్డారన్నారన్నారు. ఆటో కార్మికులపై దౌర్జన్యం చేయడం, కోర్టు వివాదంలో ఉన్న విషయాలలో కూడా కలుగజేసుకుని పంచాయతీలు చేయడం, బూతులు తిడుతూ దాడికి పాల్పడడం, తన అవినీతిని ప్రశ్నించిన వారిపై దాడి చేయడం ఎస్‌ఐకు షరా మామూలుగా మారిందన్నారు. ఈ క్రమంలో ఎస్‌ఐ అవినీతిని ప్రశ్నించిన సిపిఎం నాయకులు ఊసా వెంకటేశ్వర్లు ఓ రైతుకు సంబంధించిన భూ వివాదం విషయంలో బాధిత రైతుతో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన సమయంలో ఆయనను అసభ్య పదజాలంతో దూషించి దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. సమస్యలు పరిష్కరించడానికి పోలీసులు పనిచేయాలన్నారు. సమస్యలు సష్టించి ప్రజలపై దౌర్జన్యం చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు అవినీతిలో కూరుకుపోయి దందాలు చేస్తూ రౌడీలుగా వ్యవహరిస్తుంటే ఇక ప్రజలకు రక్షణ ఎక్కడ ఉందని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి పోలీసుల వల్ల నిజాయితీగా పనిచేసే పోలీసులందరికీ చెడ్డ పేరు వస్తుందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జివి. కొండారెడ్డి మాట్లాడుతూ భూసమస్య, అవినీతి సమస్య ఉన్నా, పేద ప్రజలకు ఎక్కడ అన్యాయం జరుగుతుందో అక్కడ ప్రజల తరఫున, రైతుల కోసం సిపిఎం పనిచేస్తుందన్నారు. ప్రజలకు, రైతులకు అన్యాయం చేస్తుంటే ప్రశ్నించే వారిపై దౌర్జన్యం చేస్తూ అవినీతికి పాల్పడుతున్న అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకునే వరకూ మండలాల స్థాయి, డివిజన్ స్థాయి, జిల్లా స్థాయిలో ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. సారా ఉద్యమాలలో పోరాటం చేసిన ఘనత ఈ ప్రాంత వాసులకు ఉందన్నారు. ఇక్కడి ప్రజలకు అన్యాయం జరిగితే కమ్యూనిస్టులు చూస్తూ ఊరుకునేది లేదన్నారు. కమ్యూనిస్టు నాయకుడు పై దౌర్జన్యం చేసిన ఎస్‌ఐపై చర్యలు తీసుకునేంతవరకు పోరాటం ఆగదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ కోర్టు వివాదంలో ఉన్న భూ సమస్యపై ఎస్‌ఐ ఓ రైతుని పిలిచి పంచాయతీ చేస్తుంటే ఆ రైతు తరఫున వెళ్లిన ఊసా వెంకటేశ్వర్లపై ఎస్‌ఐ దాడి చేయడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. సిఎస్‌పురం ఎస్‌ఐ వెంకటేశ్వర నాయక్, కానిస్టేబుల్ చంద్రనాయక్ ప్రవర్తన ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థకే అవమానకరమన్నారు. కోర్టులో ఉన్న కేసు విషయంలో రైతును పిలిపించి విచారించే హక్కు ఎస్‌ఐకి ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు. అనంతరం సుందరయ్య భవన్ సెంటర్ నుంచి సిఐ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లారు. సిఐ భీమా నాయక్ అందుబాటులో లేక పోవడంతో సిఐ కార్యాలయంలోని సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు షేక్ షమీ, సిపిఎం మండల కార్యదర్శి ఉసా రాజ్యలక్ష్మి, ఎస్. తిరుపతి రెడ్డి, ఎం.రత్నారెడ్డి, యాట వీరనారాయణ, సిహెచ్.వెంకటేశ్వర్లు, షేక్ అల్లాబక్ష్, షేక్ కాసిం సాహెబ్, సయ్యద్ గౌస్ బాషా, షేక్ మహాపీరా, ఎం.రామయ్య, షేక్ నాయబ్,, సిహెచ్.ఆదినారాయణ, అంకేపల్లి వెంకటేశ్వర్లు, పొదిలి నరసింహులు, జయరావు, షేక్ గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.



సిఐ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకలు

గాడి తప్పిన 'పోలీసు'

(మొదటిపేజీ తరువాయి

పోలీసు స్టేషన్‌లకు వెళితే పోలీసులు సమస్య పరిష్కారానికి అవసరమైన సహకారాన్ని వారి నుండి తీసుకునేవారు. ఒక్కోసారి ఇరు వర్గాలకు నచ్చజెప్పేందుకు పోలీసులు ప్రజాసంఘాల నాయకులను పిలిపించిన ఘటనలు గతంలో అనేకం ఉన్నాయి. కానీ నేడు తమ దందాలకు ప్రజాసంఘాల ప్రతినిధులు ఆటంకంగా పోలీసులు భావిస్తున్నారు. సి.యస్.పురం ఘటనలో ఈ వైఖరి స్పష్టంగా కనిపిస్తోంది. కోర్టు వివాదంలో ఉన్న భూ సమస్యపై ఎస్‌ఐ ఓ రైతుని పిలిచి పంచాయితీ చేస్తుంటే ఆ రైతు తరఫున పంచాయితీకి వెళ్లిన ఊసా వెంకటేశ్వర్లుపై ఎస్‌ఐ దాడి చేశారు. కోర్టు వివాదం ఉన్న భూ సమస్యపై పంచాయితీ చేసే హక్కు ఆ ఎస్‌ఐకు ఎవరిచ్చారో.? పోలీసు ఉన్నతాధికారులకే తెలియాలి.

కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే.?

ఎస్పీగా ఎ.ఆర్.దామోదర్ బాధ్యతలు చేపట్టిన దగ్గరి నుంచి పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అయితే తప్పు చేసిన పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకోని కారణంగానే వారు మళ్లీమళ్లీ అదే తప్పులు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తప్పు చేసిన వారు పోలీసులైనా కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

మంచికలపాడులో మద్యపాన నిషేధం

గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి మండలం మంచికలపాడు గ్రామస్తులు మద్యపాన నిషేధాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. మంచికలపాడు గ్రామంలో బెల్ట్ షాపుల ద్వారా విచ్చలవిడిగా మద్యం అమ్మకాల సాగిస్తున్నారు. రాత్రి 12 గంటల వరకు మద్యం అమ్మకాలు సాగిస్తుండటంతో ప్రజలు అల్లాడుతున్నారు. మంచికలపాడు శివారు పంచాయతీలైన బండ్లమూడి, ఎర్రగుడిపాడు గ్రామాలలో ఈపాటికి గ్రామస్తులు మద్యపానం నిషేధాన్ని పాటిస్తున్నారు. దీంతో ఆ గ్రామానికి చెందిన కొందరు మంచి కలపాడు వచ్చి మద్యం తాగుతున్నారు. మందు బాబుల ఆగడాలకు భయపడి పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులు జంకుతున్నారు. మందుబాబులు తమ ఇంటికి బదులు ఇతరుల ఇళ్లకు ఆగడాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దాదాపు 300 మంది మహిళలు శుక్రవారం మద్యం దుకాణాలపై దాడి చేసి మద్యం సీసాలను పగలగొట్టారు. తమ గ్రామంలో మద్యం అమ్మితే ఖబర్దార్ అని హెచ్చరికలు చేశారు. అనంతరం గ్రామ రైతు భరోసా కేంద్రం వద్ద గ్రామ సర్పంచి పెరికలనాగేశ్వరరావు, గ్రామ కార్యదర్శి పద్మ, గ్రామ పెద్దలు, పార్టీల నాయకులు ప్రత్యేక గ్రామసభ ఏర్పాటు చేశారు. మంచి కలపాడు గ్రామపంచాయతీ పరిధిలో ఎవరైనా బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మ రాదని, మద్యం సేవించరాదని ఏకగ్రీవ తీర్మానం చేశారు. సంపూర్ణ మద్యపానం నిషేధం ను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పొన్నపల్లి శ్రీనివాసరావు, చలువాది శ్రీనివాసరావు, పొన్నపల్లి వెంకట్రావు, పొన్నపల్లి సుబ్బారావు, అత్యల

టిడ్కో లోన్లు కట్టొద్దు.. త్వరలో రద్దు చేస్తాం..

(మొదటిపేజీ తరువాయి)

దృష్టిలో ఉంచుకుని నగరంలోని ప్రధాన రోడ్లను విస్తరణ చేస్తున్నామన్నారు. ట్రంకు రోడ్డు 100 అడుగులు, మస్తాన్ దర్గా నుండి కొత్తపట్నం రోడ్డు 80 అడుగులు, శ్రీనివాస థియేటర్ నుండి కేశవరాజు కుంట వద్ద రహదారి వరకు డివైడర్ తో కూడిన రోడ్డు 100 అడుగులు, మంగమూరు రోడ్డు సాయిబాబా గుడి నుండి ఒంగోలు పబ్లిక్ స్కూల్ వరకు 80 అడుగులు, అక్కడ నుండి ఆశ్రమం వరకు రోడ్డు 100 అడుగుల విస్తీర్ణంలో నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. గుంటూరు రోడ్డును మోడల్ రోడ్డుగా నిర్మిస్తామన్నారు. ట్రంకు రోడ్డు విస్తరణ లో షాపులు కోల్పోయిన వారికి పాత మార్కెట్ స్థలంలో నిర్మించే షాపులలో నామమాత్రపు అద్దె మరియు 25 సంవత్సరాల లీజుతో పాటు డిటిఆర్ బాండ్లు ఇస్తామన్నారు. ముస్లిముల శ్మశాన వాటిక కోసం దశరాజుపల్లె వద్ద మూడు ఎకరాల స్థలం కేటాయించి సదుపాయాలు కల్పించి ఇస్తామన్నారు.

వచ్చే వినాయక చవితికి డిజెలు ఉండవు..

ఇటీవల వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా వైసిపి నాయకులు పోలీసులపై చేసిన దాడిని ఈ సందర్భంగా దామచర్ల తీవ్రంగా ఖండించారు. పండుగ సంతోషంగా జరుపుకోవాలి గానీ మద్యం సేవించి ఏమి చేస్తున్నామో ఒళ్లు తెలియకుండా ప్రవర్తించడం సరైన పద్ధతి కాదన్నారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా చూసేందుకు వచ్చే వినాయకచవితికి ఒంగోలులో అసలు డిజెలకు అనుమతి ఇవ్వమని, కోలాటం లాంటి సాంప్రదాయ కళారూపాలకు ప్రాధాన్యత ఇస్తామని జనార్ధన్ పేర్కొన్నారు.

శంకర నారాయణ కళ్యాణ మండపం అంశం వాయిదా

శంకర నారాయణ కళ్యాణ మండపం, షాపింగ్ కాంప్లెక్స్ అంశం 61 అంశంగా ఎజెండాలో చేర్చారు. కానీ మున్సిపల్ స్థలంలో భజన మందిరం, గ్రంథాలయం పేరుతో లీజుకు తీసుకొని అక్రమంగా నిర్మించి వ్యాపారం చేస్తున్నారని, 27.56 కోట్ల రూపాయల లీజును మున్సిపాలిటీకి ఎగ్గొట్టారని ఇటీవల 'ప్రజాశక్తి' ప్రత్యేక కథనం ప్రచురించింది. ఈ మేరకు స్థానికులు శుక్రవారం నాడు కమిషనర్‌ని కలిసి లీజు రద్దు చేసి దేవాదాయ శాఖకు అప్పగించాలని వినతిపత్రం అందజేశారు. దీంతో ఈ అంశాన్ని కౌన్సిల్‌లో ఆమోదించకుండా పక్కనపెట్టారు.

కౌన్సిల్ సమావేశంలో సంతనూతలపాడు శాసనసభ్యులు బి.యన్.విజయ్ కుమార్, కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, తహశీల్దార్ పిన్నిక మధుసూదనరావు, టిడిపి, వైసిపి కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసుపై డిఎస్‌పి విచారణ

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం పోలీసు స్టేషన్‌లో నమోదు అయిన పోక్సో కేసుపై ఒంగోలు మహిళా పోలీసు స్టేషన్ డిఎస్‌పి రమణకుమార్ శుక్రవారం విచారణ జరిపారు. కొత్తపట్నం మండలం వజ్జిరెడ్డిపాలెంలో దొడ్ల వీరారెడ్డి అనే వ్యక్తి బాలికలపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. అందులో భాగంగా డిఎస్‌పి వజ్జిరెడ్డి పాలెంలో పర్యటించి వివరాలు సేకరించారు. బాలిక తల్లిదండ్రులను విచారించారు. ఇరుగురు పొరుగు వారిని కూడా విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు డిఎస్‌పి తెలిపారు. డిఎస్‌పి కొత్తపట్నం ఎస్‌ఐ వేముల సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

రైలు నుంచి ప్రమాద వశాత్తు జారిపడిన ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన శింగరాయకొండ రైల్వే స్టేషన్ పరిధిలోని పాకల గేటు వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో బీహార్‌కు చెందిన ఓ వ్యక్తి గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-కొండపి

తమ సమస్యలను పరిష్కరించాలని ఎంపిడిఒ రామాంజనేయులకు సచివాలయ ఉద్యోగులు శుక్రవారం సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. పి4 విధానంలో క్లస్టర్ మ్యాపింగ్ విధానం రద్దు చేయాలన్నారు. ఇంటింటికీ తిరిగి నిర్వహించే సర్వేలు ఇతర పనుల నుంచి విముక్తి కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-కొండపి : సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల రగ్బీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 ఎంపికలు శుక్రవారం నిర్వహించారు. కొండపి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు జి. హన్నా, డి. లేఖన, జి. జెస్సి ఈ ఎంపికల్లో పాల్గొని ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ఉపాధ్యాయులు మరియు ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, వ్యాయామ ఉపాధ్యాయుడు జంషీర్ అబ్దాల్ అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-కొండపి : సింగరాయకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన టార్గెట్ బాల్ సెలక్షన్స్ లో స్థానిక హ్యాపీ కిడ్స్ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటినట్లు కరస్పాండెంట్ అపర్ణ తెలిపారు. తమ విద్యార్థులు కె.నితీష్,బి. బ్రహ్మ సారథి ఈనెల 13, 14 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహిస్తున్న మూడవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సబ్ జూనియర్ చాంపియన్‌షిప్ పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీకలు ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ అపర్ణ, ప్రిన్సిపల్‌శోభారాణి, పిఇటి నాగరాజు అభినందించారు.

బాలినేని కలిసిన మనోజ్‌కుమార్

ప్రజాశక్తి-టంగుటూరు : మాజీ మంత్రి, జనసేనపార్టీ రాష్ట్ర నాయకుడు బాలినేని శ్రీనివాసరెడ్డిని హైదరాబాదులోని ఆయన నివాసంలో జనసేన కొండపి నియోజక వర సమన్వయకర్త కనపర్తి మనోజ్ కుమార్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సత్కరించారు. కొండేపి నియోజకవర్గంలోని సమస్యలు, అభివద్ధి కార్యక్రమాలు, పార్టీ కార్యక్రమాల గురించి మనోజ్ కుమార్ బాలినేనికి వివరించారు. బాలినేని కలిసిన వారిలో జనసేన పార్టీ కందుకూరు టౌన్ నాయకులు దారం పవన్‌కుమార్, పొన్నలూరు మండల నాయకుడు పత్తిపాటి మాధవరావు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న శైలశ్రీ

అంగన్‌వాడీ యూనియన్ జిల్లా మహాసభ

ప్రజాశక్తి - బాపట్ల


అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ద్వితీయ మహాసభను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు వి శైలశ్రీ కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం జరిగిన అంగన్‌వాడీల సమావేశంలో ఆమె మాట్లాడారు. నేడు చీరాలలో జరుగుతున్న జిల్లా మహాసభల్లో గత రెండేళ్ళుగా అంగన్‌వాడి కార్యకర్తల కోసం చేసిన పోరాట కార్యక్రమాలు సమీక్షించుకొని భవిష్యత్తు కర్తవ్యాలు నిర్ణయించుకుంటామని తెలిపారు. గత ఎన్నికలకు ముందుగా రాష్ట్ర వ్యాప్తంగా 42 రోజులు పాటు సమ్మె చేసి అనేక జీఓలు సాధించుకున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడి కార్యకర్తలకు కొత్త ఫోన్లు ఇవ్వాలని కోరారు. మహాసభలో అంగనవాడి యూనియన్ సిఐటియు నాయకులు, జిల్లాలోని అంగన్‌వాడి కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి సీతామాలక్ష్మి, ఎన్ హేమ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మహేంద్రనాథ్

మంత్రి లోకేష్ కృషి హర్షనీయం

ప్రజాశక్తి - చీరాల

ఇటీవల నేపాల్‌లో చోటుచేసుకున్న హింసాకాండలో చిక్కుకున్న 215 మంది తెలుగు ప్రజలను సురక్షితంగా స్వస్థలాలకు చేర్చడంలో మంత్రి నారా లోకేష్ బాబు కీలక పాత్ర పోషించారని టిడిపి అధికార ప్రతినిధి ఎం మహేంద్రనాథ్ తెలిపారు. సూపర్ సిక్స్ సభకు హాజరు కాకుండా అమరావతిలోనే ఉండి స్వయంగా పర్యవేక్షిస్తూ ప్రత్యేక విమానాల ద్వారా వారిని తెప్పించేందుకు ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. కార్యక్ర మంలో ఎఎంసి ఛైర్మన్ కౌతరపు జనార్ధనరావు, టిడిపి మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం, మున్సిపల్ ఛైర్మన్ మించాల సాంబశివరావు, జంగిలి రాముడు, శివ నాగమల్లేశ్వరి, పిక్కి నారాయణ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.


అక్రమ్ ఘోరీ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

ప్రజాశక్తి - చెరుకుపల్లి

విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి అత్యుత్తమ మైనదని ఎంఇఒ పులిలాజర్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా కలెక్టర్ చే అవార్డు అందుకున్న ఉపాధ్యాయుడు అక్రమ్ ఘోరీ దంపతులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. గూడవల్లి ప్రాథమిక పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న అక్రమ్ ఘోరీ దంపతులను ఘనంగా సన్మానించారు. ఇస్లాంపేట కనగాల హెచ్ఎం షేక్ రహమతున్నిసా మాట్లాడారు. మాస్టారు కష్టపడి పని చేసే తత్వం కలవారని అన్నారు. సహోపాధ్యాయురాలు ఆసియా బేగం, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రజియా బస్రి, ఆరిఫా, షమాయతున్నిసా, ముంతాజ్ బేగం, అమీరున్నిసా, మొహమ్మద్ నజీర్ అహ్మద్, ఉపాధ్యాయురాలు పర్వీన్, ఎస్ఎంసి ఛైర్మన్ షేక్ షబీన పాల్గొన్నారు.

చిరస్మరణీయులు సీతారాం ఏచూరి


ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం


ఏచూరికి నివాళులర్పిస్తున్న కామ్రేడ్ వెంకట్రావు

ప్రజాశక్తి - బాపట్ల

జాతీయ స్థాయిలో మతోన్మాదానికి ఆర్ఎస్ఎస్ విధానాలకు వ్యతిరేకంగా అనేక గ్రంథాలు రచించిన అమరులు, ప్రజా నాయకులు, మార్క్సిస్టు మేధావి సీతారాం ఏచూరి చిరస్మరణీయులని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ అన్నారు. సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి వాళులు అర్పించారు. పదేళ్ల పాటు ఆయన మార్గదర్శకత్వంలో జాతీయ కార్యదర్శిగా ఆయన నిర్వహించిన పాత్ర అన్ని పార్టీల మన్ననలు పొందిందన్నారు. పార్లమెంటులో సైతం టీ బ్రేక్ సమయంలో ఆయన వేచి ఉండే ప్రాంతానికి ఏచూరి కార్నర్‌గా పేరు రావడం ఆయన విశిష్టతకు నిదర్శనం అన్నారు.


ఏచూరి స్మారక ఉచిత వైద్య శిబిరం

సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలో రైలు పేటలో ఈనెల 4న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పి కొండయ్య, కె నాగేశ్వరరావు, వై భాస్కరరావు, తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

అద్దంకి : కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. అభ్యుదయ నగర్ సుందరయ్య భవన్లో కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభలో ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎస్ వెంకట్రావు మాట్లాడారు. సభకు బి విజయ్ కుమార్ అధ్యక్షత వహించారు. సభలో వెంకట్రావు అమెరికా సుంకాలు భారతదేశంపై ప్రభావాలు అంశంపై మాట్లాడారు. అమెరికా ద్వంద వైఖరితో అనేక దేశాల్లో యుద్ధ వాతావరణం సృష్టించి లాభపడే స్థాయికి దిగజారిందని అన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కావూరి రఘు చంద్, కాకర్ల వెంకటేశ్వర్లు, రాజు, ఎస్ హనుమంతరావు, సామ్యూల్, ఆదాం, డివి సుబ్బారావు పాల్గొన్నారు.

రేపల్లె : సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి స్థానిక సిపిఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్ంగా సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ మాట్లాడారు. సీతారాం ఏచూరి ఆదర్శ కమ్యూనిస్టుగా జీవితాన్ని గడిపారని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు వై కిషోర్, కె రమేష్, డి అగస్టిన్, జి దానియేలు, వై నవీన్, కె గోపి పాల్గొన్నారు.

అమృతలూరు : సిపిఎం అగ్ర నాయకులు, అఖిల భారత మాజీ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి వర్ధంతి మండలంలోని కూచిపూడిలో ఘనంగా నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం వేమూరు కార్యదర్శి బి అగస్టీన్ మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి పి రాజు, కె శ్యాంసన్, గాజులవర్తి సత్యన్నారాయణ పాల్గొన్నారు.


రేపల్లెలో ఏచూరి వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం


ఏచూరికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

మెరుగైన విద్య, వైద్యం అందించడమే లక్ష్యం

మంత్రి గొట్టిపాటి రవి కుమార్

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవవారం చెక్కులు పంపిణీ చేశారు. 218 మంది లబ్ధిదారులకు రూ.1.18కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. వీటితో పాటు రూ.9లక్షల విలువైన (ఎల్ఓసీ) లెటర్ ఆఫ్ క్రెడిట్లను ఐదుగురు లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. సిఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రవేశపెడుతున్న కొత్త హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ విధానం రాష్ట్ర చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఎక్కువ మంది పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యతోనే కొత్త హెల్త్ పాలసీని ప్రభుత్వం తీసుకొస్తుందని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ అరాచకాలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్థమైనా ప్రజా సంక్షేమం కోసమే సూపర్ 6 పథకాలు పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నామని వివరించారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.


చెక్కు అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

రైతులు పొగాకు సాగు చేయొద్దు

మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి - పంగులూరు

రైతులెవరు ఈ సంవత్సరం బర్లీ పొగాకు సాగు చేయవద్దని, ప్రభుత్వమే ఈ నిర్ణయం తీసుకుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బూదవాడలో రైతులతో ఆయన మాట్లాడారు. రైతులు పొగాకు బదులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని చెప్పారు. గతేడాది నల్లబర్లి పొగాకు సాగు చేయడం వలన రైతులు విపరీతంగా నష్టపోయారని చెప్పారు. రైతుల సమస్యను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం మొట్ట మొదటి సారిగా మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు ప్రారంభించిందని చెప్పారు. దీనివలన రైతులకు ఎంతో ఉపయోగపడిందని చెప్పారు. ఇప్పటివరకు రోజుకు 20 క్వింటాళ్ల వరకే కొనుగోలు చేసేందుకు మెసేజ్లు పంపుతున్నారని, రైతుల వద్ద ఇంకా పొగాకు నిల్వ ఉందని మంత్రి దృష్టికి రైతులు తీసుకువచ్చారు. రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తం కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన హామీ ఇచ్చారు. మార్క్‌ఫెడ్ డి ఎం కరుణశ్రీ విలేకరులతో మాట్లాడుతూ అద్దంకిలో ఇప్పటివరకు 1856 మంది రైతులు దగ్గర 2148 టన్నుల పొగాకు కొనుగోలు చేశామని చెప్పారు. జిల్లాలో 8 పొగాకు కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు 17వేల టన్నులు కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు రూ.127 కోట్లు రైతులకు ఇవ్వాల్సి ఉండగా రూ.90 కోట్లు రిలీజ్ చేశామని అన్నారు. అవి రైతుల ఖాతాల్లోకి జమవుతున్నాయని చెప్పారు. ఇంకా రూ.37 కోట్లు రైతులకు రావాల్సి ఉందని అన్నారు. సోమవారం నుండి పంగులూరు రైతుల పొగాకును గుంటూరులో కొనుగోలు చేస్తామని చెప్పారు. అందువలన మండలానికి చెందిన పొగాకు రైతులంతా పొగాకును గుంటూరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎఒ డి సుబ్బారెడ్డి, మార్క్‌ఫెడ్ అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ నరసింహారావు, బయ్యర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్


మాట్లాడుతున్న సిఐటియు ఉపాధ్యక్షుడు ఎం వసంతరావు

పోరాటంతోనే సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - పంగులూరు

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం వసంతరావు అన్నారు. సిఐటియు మండల మహాసభ స్థానిక రోటరీ భవన్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఉండే స్కీం వర్కర్లకు అనేక సమస్యలు ఉన్నాయని అన్నారు. అంగన్వాడీలు 42 రోజుల పాటు పోరాడారని చెప్పారు. గ్రీన్ అంబాసిడర్లు పోరాట ఫలితంగానే ప్రభుత్వం ఆరోగ్య అలవెన్స్ కింద రూ.4వేలు పెంచుతున్నట్లు జిఒ ఇచ్చిందని అన్నారు. ఆ జీఓను అమలు జరిగేటట్లు చేసుకునేందుకు మరో పోరాటం చేయాలని అన్నారు. అనంతరం గుడిపాటి మల్లారెడ్డి కన్వీనర్‌గా డి ఆదిశేషం రాజు, గుంజి వెంకట్రావు, మన్నెం సుబ్బయమ్మ, లక్ష్మీరాజ్యం, పి ఏడుకొండలు, స్వర్ణలత, సువార్త, పీ మాధవ రావు సభ్యులుగా కమిటీనీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


ఉపాధ్యాయులకు ల్యాప్ ట్యాప్‌ను అందజేస్తున్న దృశ్యం

పాఠశాలకు లాప్‌టాప్ బహూకరణ

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని బూదవాడ జెడ్పి ఉన్నత పాఠశాలకు అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ శుక్రవారం ల్యాప్ టాప్ బహుకరించారు. రూ.25 వేల విలువగల ఈ ల్యాప్ ట్యాప్‌ను పాఠశాల ఉపాధ్యాయుల సమక్షంలో ప్రధానోపాధ్యాయులు పూసల రఘురామయ్యకు అందజేశారు. ఈ ల్యాప్ ట్యాప్‌ను పాఠశాల అవసరాలకు ఉపయోగించు కోవాలని కోరారు. దీని ద్వారా విద్యార్థులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలియజేయాలని కోరారు.

తొలగించిన సిబ్బందిని

విధుల్లోకి తీసుకుంటాం: దామచర్ల


దామచర్లతో మాట్లాడుతున్న ఫెడరేషన్ నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

తొలగించబడిన మేస్త్రీలను విధుల్లోకి తీసుకోవడంతో పాటు మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పిస్తామని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు హామీ ఇచ్చారు. శుక్రవారం నాడు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే దామచర్లకు మెమోరాండం అందజేశారు. సిఐటియు నగర కన్వీనర్ టి.మహేష్, జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు మున్సిపాలిటీలో 12 మంది మేస్త్రిలను అర్ధాంతరంగా తొలగించారని, కోవిడ్ కాలంలో, ఆ తరువాత మరణించిన కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. మరణించిన కార్మికుల కుటుంబసభ్యులకు సంబంధించిన అంశంపై దామచర్ల కమిషనర్ డాక్టర్ కె వెంకటేశ్వర రావుతో మాట్లాడారు. అర్హులైన వారికి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు జి. నరసింహం, టీ.విజయమ్మ, రాష్ట్ర నాయకురాలు కే. సామ్రాజ్యం, ఆర్.శ్రీనివాసరావు, ఎం.బాబు, వై.రవి, బి.జేమ్స్, లక్ష్మీకాంతం, పి. కోటేశ్వరి, భారతి, కే. యాకోబు, ఆర్. రాములు, కే.మోహన్‌రావు, రవణమ్మ, కృష్ణ పాల్గొన్నారు.

'స్విమ్స్' సహకారంతో ఉచిత వైద్యశిబిరం


వైద్యసేవలందించిన డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావును సత్కరిస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జూనియర్ ఛాంబర్ వారోత్సవాలు నాలుగో రోజులో భాగంగా శుక్రవారం ఉదయం ఆరు గంటల నుంచి పది గంటల వరకు వాకర్స్‌కి ఒంగోలులోని స్విమ్స్ హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్విమ్స్ హాస్పిటల్ డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావు, డాక్టర్ వి.సురేష్ 250 మంది పేషెంట్లకు వైద్య సేవలందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్య సేవలందించిన డాక్టర్లను జెసిఐ సభ్యులు ఘనంగా సత్కరించారు. ముందుగా వైద్య శిబిరాన్ని జూనియర్ ఛాంబర్ జోన్ ప్రెసిడెంట్ భరత్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం వ్యాపారస్తులకు బిజినెస్ ట్రైనింగ్ ప్రోగ్రామ్, క్విజ్ పోటీలు, చెస్, డ్రాయింగ్, క్లాసికల్ డాన్స్ తదితర పోటీలు నిర్వహించారు. జడ్జీలుగా రిటైర్డ్ డిప్యూటీ తహాశీల్దార్ ఎస్‌డి.ఇస్మాయిల్, ఫ్రీడమ్ బర్డ్స్ డైరెక్టర్ మాల్యాద్రి, ఎస్.ఇంద్రజ్యోతి, ఆత్మకూరు బ్రహ్మయ్య వారి బృందం వ్యవహరించారు. కార్యక్రమంలో సోనా అధ్యక్షులు, జూనియర్ ఛాంబర్ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి వి.సుబ్బారావు, ఎం.గణేష్, కె.వీరబ్రహ్మం, జూనియర్ ఛాంబర్ వారోత్సవాల చైర్మన్ శివకోటిరెడ్డి, కార్యదర్శి కె.శ్రీనివాసరావు, కోశాధికారి కె సుబ్రహ్మణ్యం, చైర్మన్, కో చైర్మన్ జి.బాలకష్ణ, పి శబరినాథ్ నాయర్, పిఅనిల్ పాల్గొన్నారు.

పాత మార్కెట్‌ను అభివృద్ధి చేయాలి..

- మున్సిపాలిటీనే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలి
- సిపిఎం డిమాండ్


కమిషనర్‌కు అర్జీ ఇస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలు నగరంలోని పాత మార్కెట్ స్థలంలో ప్రతిపాదిత షాపింగ్ కాంప్లెక్స్‌ను పబ్లిక్, ప్రైవేట్, పార్ట్‌నర్‌షిప్ (పిపిపి) పద్ధతిలో నిర్మించే ఆలోచన ఉపసంహరించి.. మున్సిపాలిటీ యాజమాన్యం నిర్మించాలని సిపిఎం బందం విజ్ఞప్తి చేసింది. శుక్రవారం నగర పార్టీ ఆధ్వర్యంలో నగర కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, మేయర్ గంగాడ సుజాతకు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు జి.రమేష్ మాట్లాడుతూ పాత మార్కెట్ స్థలాన్ని వినియోగంలోకి తేవడం శుభపరిణామమని, అయితే పిపిపి పద్ధతిలో నిర్మిస్తే మున్సిపాలిటీకి చెందావలసిన ఆదాయం తగ్గిపోతుందన్నారు. పిపిపి విధానాన్ని కౌన్సిల్ తిరస్కరించి, మున్సిపాలిటీ స్వయంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్. వీరాస్వామి, నాయకలు మారెళ్ళ సుబ్బారావు, టి. భక్తసింగ్ రాజ్, వి. మాలకొండయ్య, ఎం. సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప రాష్ట్రపతి ప్రమాణ స్వీకారంలో ఎంపీ మాగుంట

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

భారత ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి హాజరయ్యారు. ఉప రాష్ట్రపతి ప్రమాణ స్వీకార కార్యక్రమం సందర్భంగా ఢిల్లీకి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని మాగుంట మర్యాదపూర్వకంగా కలిశారు.


సిఎం చంద్రబాబు వెంట ఎంపీ మాగుంట

ప్రభుత్వ ప్రోత్సాహంతోనే పరిశ్రమల అభివృద్ధి

- సెంట్రల్ జోన్ చైర్మన్ శిద్దా సుధీర్‌కుమార్ - బెస్ట్ బిజినెస్ ఎక్స్‌పోర్ట్ అవార్డు అందజేత


అవార్డు అందుకుంటున్న శిద్దా సుధీర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతోనే పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఫెడరేషన్ సెంట్రల్ జోన్ చైర్మన్ శిద్దా సుధీర్ కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన బిజినెస్ ఎక్సలెన్స్ లో ఉత్తమ బిజినెస్ ఎక్స్‌పోర్ట్ అవార్డును రాష్ట్ర మంత్రుల నుంచి జ్యోతి గ్రానైట్ ఇండియా ఎక్స్పో ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శిద్దా సుధీర్‌కుమార్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రానైట్ పరిశ్రమల అభివద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారం మర్చిపోలేమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కొత్తతరం జిఎస్‌టి సంస్కరణ విధానం ప్రవేశపెట్టిన కారణంగా ఆహారం, విద్య, వైద్య, వ్యవసాయం రంగాల అభివద్ధి, సగటు మనిషి జీవన ప్రమాణం మెరుగుపడటమే కాకుండా కొనుగోలు శక్తి పెరిగి.. ఆర్థికాభివృద్ధి చెందుతుందన్నారు. కొత్త జిఎస్‌టి సంస్కరణ చేపట్టిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ సెంట్రల్ జోన్ తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించే ప్రోత్సహంతో పరిశ్రమలు సంక్షోభం నుండి సంక్షేమం బాట పట్టిందన్నారు. తమ సంస్థకు 2025 ఉత్తమ బిజినెస్ ఎక్స్‌పోర్ట్ అవార్డు రావడానికి సహకారం అందించి నిత్యం తమకు మార్గదర్శకులుగా ,సంస్థ విజయాలకు చేయూతను అందిస్తున్న తన తండ్రి, చైర్మన్ శిద్దా రాఘవరావు ప్రోత్సాహం మర్చిపోలేమన్నారు. తమ సంస్థ సిఒఒ ఎమ్.శివరామ్, సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులకు, కార్మికులకు ప్రతి ఒక్కరికీ కతజ్ఞతలు తెలిపారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఫెడరేషన్ జ్యూరీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ భారీ పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్, ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, జ్యూరీ సభ్యులు విశ్రాంత ఐఏఎస్ అధికారులు నిమ్మగడ్డ రమేష్‌కుమార్, సత్యనారాయణ, ఫుడ్ ప్రాసెసింగ్ సెక్రటరీ చిరంజీవి చౌదరి, రీసెర్చ్ ఇన్నోవేషన్ సర్కిల్ హైదరాబాద్ డైరెక్టర్ జనరల్ అజిత్ రగ్నెకర్, ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షులు పొట్లూరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ పాల్గొన్నారు.

జాతీయ పాఠశాల క్రీడలకు ఎంపిక

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రూపొందించిన 69వ నేషనల్ స్కూల్ గేమ్స్ క్యాలెండర్ ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా పాంశాల క్రీడల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎ.కిరణ్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న బాలురు, బాలికలు అండర్-14 జనవరి 1,2012 లేదా ఆ తరువాత జన్మించిన విద్యార్థులు, అండర్-17 జనవరి 1, 2009 లేదా ఆ తరువాత జన్మించిన విద్యార్థులు (6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం వరకు చదువుతున్నవారు) అర్హులుగా పేర్కొన్నారు. విభాగాల వారీగా టోర్నమెంట్ కమ్ సెలెక్షన్ పోటీలు జరగనున్నాయి. రాష్ట్ర స్థాయి జట్ల ఎంపికకై సెప్టెంబర్ 13 నుంచి 19 వరకు వివిధ క్రీడా వేదికలలో పోటీలు జరుగనున్నాయని తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇది గొప్ప అవకాశమని, ఆసక్తి గల బాల బాలికలు తప్పక పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ డాక్టర్ చక్కా వెంకటేశ్వర్లు, అల్లాడి శిరీషను సంప్రదించవచ్చని తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డి1 పరిధిలో నూతన 33కెవి లైన్, శ్రీగిరి సబ్ స్టేషన్ కొండమీద నుండి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వరకు ఆల్టర్‌నేట్ సప్లై ఏర్పాటు చేయటం కోసం శనివారం ఉదయం 9 గంటల నుండి 2 గంటల వరకు కొన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డిఇఇ కెవి. పాండురంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. వన్ టౌన్ పోలీస్ స్టేషన్, మున్సిపల్ ఆఫీస్, శివాలయం, సివిఎన్ రీడింగ్ రూమ్, గాంధీ రోడ్, ఏనుగు చెట్టు, మాతా శిశు వైద్యశాల, కోర్ట్ సెంటర్ , సెంట్రల్ కేఫ్, శ్రీగిరి కొండమీద, రాజాపానగాల రోడ్డు, జమ్మి చెట్టు బజారు, సాయిబాబా టెంపుల్ ఎదురు, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, గద్దలగుంట, తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అక్టోబర్ 23 లోపు

రెగ్యులరైజేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలి

నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు


క్షేత్రస్థాయిలో విచారిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

అనధికార లేఅవుట్లలో ప్లాట్లు ఉన్న యజమానులు, డెవలపర్స్ ప్రభుత్వం ఇచ్చిన గడువు అక్టోబర్ 23 లోపు రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. అనధికార లేఅవుట్లు, ప్లాట్ల రెగ్యులరైజేషన్ నిబంధనలకు సవరణలు చేసి గడువు పొడిగించారు. దీనిని అనుసరించి.. ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలో నూతనంగా అనధికార లేఅవుట్ ప్లాట్లు రెగ్యులరైజేషన్ కోసం 27 అప్లికేషన్లు వచ్చాయి. ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ వచ్చిన దరఖాస్తుల మేరకు క్షేత్రస్థాయిలో విచారించి 10 దరఖాస్తులను వెంటనే రెగ్యులరైజేషన్ చేసి ఆమోదించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు అందుకోవాలని కమిషనర్ వెంకటేశ్వరరావు కోరారు. 45 రోజులో పూర్తి మొతాన్ని చెల్లిస్తే 10 శాతం తగ్గింపు లభిస్తుందన్నారు. 45-90 రోజులో పూర్తి మొతాన్ని చెల్లిస్తే 5 శాతం తగ్గింపు లభిస్తుందని, ఓపెన్ స్పేస్ ఉన్నప్పుడు భూమి విలువపై 7 శాతం అదనపు ఛార్జీలు ఉంటాయని (14 శాతం ఓపెన్ స్పేస్ ఛార్జీలపై 50 శాతం రాయితీ ఇవ్వబడింది) చెప్పారు. ఆస్తి విలువ పెరుగుతుందని,భద్రత లభిస్తుందని, బ్యాంకులు రుణసౌకర్యాన్ని కల్పిస్తాయని, క్రయ, విక్రయాలు చేసుకునేందుకు ఉన్న అడ్డంకులు తొలగిపోతాయని చెప్పారు. సునాయాసంగా అనుమతులు లభిస్తా య న్నారు. సకాలంలో రెగ్యులరైజేషన్ చేసుకొనకపోతే ప్లాటు చట్టబద్ధం కానందున భవన అనుమతి ఇవ్వబడదన్నారు. క్రయ, విక్రయ మార్పిడి చేసుకోవడం వంటి అంశాలు సమస్యాత్మకంగా మారతాయని తెలిపారు. ఆస్తి విలువ తగ్గుతుందని, భవిష్యత్తులో ప్రభుత్వ చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏసీపీ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు. .

బాధిత కుటుంబాలకు

వైసిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలు పట్టణంలోని 45వ డివిజన్‌కు చెందిన వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అరెస్టు చేయబడి.. జైలులో ఉన్న నేపథ్యంలో, వారి కుటుంబ సభ్యులను వైసిపి నేతలు శుక్రవారం నాడు పరామర్శించారు. ప్రకాశం జిల్లా వైసిపి అధ్యక్షులు, దర్శి శాసన సభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానంద రెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చుండూరు రవిబాబు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణారెడ్డి, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు నగిరికంటి శ్రీనివాసరావు తదితరులు కార్యకర్తల కుటుంబాలను కలసి ధైర్యం చెప్పారు. నాయకులు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలపై జరిగిన ఈ అరెస్టులు పూర్తిగా అక్రమమని, ప్రజాస్వామ్య హక్కులను ఉల్లంఘించే చర్యగా ఖండించారు. జైలులో ఉన్న కార్యకర్తలకు పూర్తి న్యాయం జరిగే వరకు పార్టీ అండగా ఉంటుందని, న్యాయపరంగా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యకర్తల కుటుంబాలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, పార్టీ ఎల్లప్పుడూ వారితో ఉంటుందని స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ హరిబాబు

డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - చీరాల

యువతలో వేగంగా వ్యాపిస్తున్న డ్రగ్స్ మహమ్మారిపై ప్రభుత్వం, పోలీసులు, సామాజిక సంస్థలు కలసి కఠిన చర్యలు ప్రారంభించాయని పట్టణ సీఐ సుబ్బారావు తెలిపారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు స్థానిక ఎస్ఎఆర్ఆర్ఎం ఉన్నత పాఠశాలలో డ్రగ్స్ వద్దు బ్రో శక్తి యాప్ అనే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల అనర్థాలు వివరించారు. డ్రగ్స్ వ్యతిరేక పోరాటం ఒక్కరితో సాధ్యం కాదని, ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి కోరారు. కార్యక్రమంలో శక్తి టీం సబ్ డివిజన్ ఇంచార్జ్ ఎస్ఐ హరిబాబు, కె సుబ్బారావు, ఈగల్ టీం సభ్యులు సురేష్, హెచ్ఎం టి నాగేశ్వరరావు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కె అంజిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ రవీంద్ర

చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - కర్లపాలెం

కర్లపాలెం పంచాయతీ పరిధిలోని శ్రీనివాస కూల్ డ్రింక్ షాపులో నగదు చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి పక్కనున్న శ్రీనివాస్ కూల్ డ్రింక్స్ షాపులో గుర్తు తెలియని వ్యక్తి డబ్బు దొంగిలించిన విషయంపై అందిన పిర్యాదు కేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. చుండూరు గ్రామానికి చెందిన కుంభ వెంకటేష్ 12న శుక్రవారం ఉదయం 9 గంటలకు ముద్దాయిని స్థానిక ఐ ల్యాండ్ సెంటర్లో అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అతని వద్ద నుండి చోరీ సొత్తును స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఘనంగా హిందీ దినోత్సవం

ప్రజాశక్తి - అద్దంకి

ఈనెల 14న జాతీయ హిందీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం సింగరకొండ కట్ట రామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి మోహనరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో షర్మిల రాణి, రామకృష్ణ, వి ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని ఉత్తర, దక్షిణ విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్వహణ, మరమ్మత్తుల కారణంగా నేటి ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు పట్టణం పరిధిలో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం దామోదరం తెలిపారు. వినియోగదారులు విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

పంగులూరు : ముప్పవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ పి ఆంజనేయులు తెలిపారు.


భట్టిప్రోలు : విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ మరమత్తు పరుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఎడిఎ డి శ్యాం సుందర బాబు తెలిపారు.

సిఐటియు మహాసభ ఆహ్వాన సంఘం ఏర్పాటు

మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - రేపల్లె

సిఐటియు జిల్లా 2 మహాసభల ఆహ్వానసంఘం ఏర్పాటు చేశారు. సెప్టెంబర్ 27, 28 తేదీల్లో పట్టణంలోని శ్రీ శుభంకర ఎలైట్‌లో జరిగే మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్స్ ఆవిష్కరించారు. సిఐటియు అనుబంధ సంఘాలు, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ఫెడరేషన్ ప్రముఖులతో ఆహ్వాన సంఘం ఏర్పాటు చేశారు. ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు, వ్యాపారవేత్త మోపిదేవి శ్రీనివాసరావు, అధ్యక్షులుగా పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి కె సాయిప్రసాద్, కన్వీనర్‌గా సిహెచ్ మణిలాల్, సభ్యులుగా ఎంవి సుబ్రహ్మణ్యం, కె అంకమ్మరావు, కె ఏడుకొండలు, కె ఝాన్సీ, బిఎల్‌కె ప్రసాద్, జె ధర్మరాజు, వై కిషోర్, ఆటో, ఆశా, విద్యార్థి, యువజన, రైస్ మిల్ ముఠా, రైతు, మహిళ తదితర సంఘాల నాయకులతో ఆహ్వాన సంఘం ఏర్పాటు చేశారు. ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు మోపిదేవి శ్రీనివాసరావు మాట్లాడుతూ వామపక్ష, కమ్యూనిస్టు ఉద్యమాలు చరిత్ర ఉన్న



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఐటియు అధ్యక్షులు మణిలాల్

రేపల్లెలో నూతనంగా ఏర్పడిన బాపట జిల్లా కార్మిక సమస్యలపై చర్చించడానికి మహాసభలు జరగటం మంచి పరిణామమని అన్నారు. ఆహ్వాన సంఘం కన్వీనర్ మణిలాల్ మాట్లాడుతూ సెప్టెంబర్ 27, 28 తేదీల్లో జరిగే మహాసభల సందర్భంగా కార్మిక ప్రదర్శన, నెహ్రూబొమ్మ వద్ద బహిరంగసభ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వై కిషోర్, కొప్పుల గోపి, సిహెచ్ ప్రకాష్, బి నాగరాజు, కె గాంధీ, డి శ్రీనివాసరావు, జి వెంకటేశ్వరరావు, వై నవీన్, కె రమేష్, డి అగస్టిన్ పాల్గొన్నారు.

తూర్పుసత్రం పాలకవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - బాపట్ల

మహోన్నత ఆశయాలతో ప్రజా శ్రేయస్సు కోసం దాతలు ఏర్పాటు చేసిన పేరం గరుడాచలం నాయుడు తూర్పు సత్రం అభివృద్ధికి నూతనంగా బాధ్యతలు చేపట్టిన పాలకవర్గం విశేష కృషి చేయాలని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. పట్టణంలోని పేరం గరుడాచలం తూర్పు సత్రం పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన హాజరయ్యారు. సత్రం ఆర్థిక సహకారంతో విద్యార్థులకు స్కాలర్ షిప్పులు అందజేశారు. పాలకవర్గంతో సత్రం కార్య నిర్వహణ అధికారి డి వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకారం చేయించారు.

తూర్పు సత్రం నూతన కమిటీ

చైర్మన్ గుంటుపల్లి తులసి కుమారి, కార్యవర్గ సభ్యులుగా డి శిరీష, ఆవుల వెంకటసుబ్బమ్మ, ఎన్ రమాదేవి, పులివర్తి కిరణ్, పంచాఙ్జుల రుక్మిణి, దేవరకొండ చెన్నకేశవులు, శిఖరం శ్రీను, కె కిరణ్‌తో



తూర్పు సత్రం నూతన పాలకవర్గంతో నరేంద్రవర్మ

కూడిన నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు, జనసేన ఇన్‌ఛార్జి నామన వెంకట శివన్నారాయణ, గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, జనసేన నాయకులు విన్నకోట సురేష్, గొట్టిపాటి శ్రీకృష్ణ, అంజనేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పంగులూరు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఎపిటిఎఫ్ నాయకులు తహశీల్దారు పి సింగారావుకు వినతి పత్రం శుక్రవారం అందజేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల దీర్ఘకాల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తీవ్రమైన అలసత్వాన్ని ప్రదర్శిస్తుందని ఎపిటిఎఫ్ నాయకులు ఆరోపించారు. ఆర్థిక బకాయిలు విడుదల చేయలేదని అన్నారు. పెండింగ్లో ఉన్న నాలుగు డిఎలను వెంటనే విడుదల చేయాలని కోరారు. సిపిఎస్ రద్దు చేయాలని, మెమో నెంబర్ 57 వెంటనే అమలు చేయాలని, 12వ పిఆర్సి కమిషన్ నియమించి, ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ జంపని వెంకటేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్ కంకణాల శ్రీనివాసరావు, ఎస్‌కె రహంతుల్లా, వెంకట్రావు, గుర్రం ప్రసాదు, చెంచు



వినతి పత్రం అందజేస్తున్న ఏపిటిఎఫ్ నాయకులు

రామారావు, రాఘవరెడ్డి, అనిల్ కుమార్, సుబ్బారావు, నారాయణ, కె జాకబ్, లలిత, అనిత, నారాయణమ్మ, మరియమ్మ, కృష్ణవేణి, జయమ్మ, ప్రమీల పాల్గొన్నారు.

భట్టిప్రోలు : ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పెండింగ్లో ఉన్న నాలుగు డిఏలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. సిపిఎస్ రద్దు చేయాలని కోరారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి - ముండ్లమూరు

ప్రకాశం జిల్లా ఆత్మ సౌజన్యంతో మండలంలోని పులిపాడు, బసవాపురం, పసుపుగల్లు గ్రామంలో రైతులు మొక్కజొన్న, వరి సాగు చేస్తున్న పొలాల్లో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ పి సంధ్యారాణి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్ వరప్రసాదరావు సూచించారు. పొలాలు సందర్శించారు. రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. వరి పొలాలు పరిశీలించి వరిలో ఆకుముడత ఆశించే ప్రమాదం ఉందని చెప్పారు. ఆకు ముడత నివారణకు కారటాప్ హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములు ఒక లీటర్ నీటితో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఆకుముడత ఉధృతి ఎక్కువగా ఉంటే క్లోరాంటా నిలిప్రోల్ మందు ఎకరాకి 40 మి.లీ పిచికారి చేసుకోవాలని సూచించారు. ఎరువులు, పోషకాలు యాజమాన్యం చేపట్టాలని సూచించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు ఆశించిందని అన్నారు. కత్తెర పురుగు నివారణకు ప్రథమ దశలోనే లక్షణాలు గుర్తించి ఒక ఎకరాకు 80 గ్రాములు ఇమామెక్టిన్ బెంజోయేట్ అనే మందును మొక్కల మొవ్వులు, సుడుల్లో వేసుకొని పురుగు నివారించుకోవాలని తెలిపారు. ఆత్మ రామిరెడ్డి మాట్లాడుతూ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే ఈ మందుతో పాటు క్లోరాంట్రా నిలిప్రోల్ లేదా కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఒక ఎకరాకు 4 కేజీల చొప్పున మొక్కల సుడిల్లో వేసుకొని నివారణ చేసుకోవాలని సూచించారు.



విద్యార్థులకు వ్యాక్సిన్ ఇస్తున్న వైద్యులు

టైఫాయిడ్ వ్యాక్సినేషన్ శిబిరం

ప్రజాశక్తి - రేపల్లె

ఐఎంఎ నిర్వహణలో బయో మెడ్ కేర్ సహకారంతో పట్టణంలోని రామకృష్ణ పబ్లిక్ స్కూల్, మోంట్ ఫోర్ట్ హై స్కూల్, ఇతర విద్యా సంస్థల్లో అతి తక్కువ ధరకు టైఫాయిడ్ వ్యాక్సిన్ ఇప్పించారు. శిబిరంలో 500 మందిపైగా విద్యార్థులకు వ్యాక్సిన్ ఇచ్చినట్లు ఐఎంఎ కార్యదర్శి డాక్టర్ వసంతం వీరరాఘవయ్య తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ముందు ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రులు సకాలంలో టైఫాయిడ్ వ్యాక్సిన్ ఇప్పించాలని సూచించారు. టైఫాయిడ్ నుండి రెండేళ్ల రక్షణ కల్పించే వ్యాక్సిన్ విద్యార్థులకు అందించడంపై పాఠశాలల యాజమాన్యాల కృషి అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో రాజ్ కుమార్, రామకృష్ణ స్కూల్ కరస్పాండెంట్ కుర్ర ఆవరణ, మౌంట్ ఫోర్ట్ స్కూల్ ప్రిన్సిపల్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇంచార్జి ఎంపిడిఓ

అడిగిన వారికి జాబ్ కార్డు ఇవ్వాలి

ప్రజాశక్తి - పర్చూరు

ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ఉపాధి హామీ పథకంలో అడిగిన ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు ఇవ్వాలని ఇన్చార్జ్ ఎంపిడిఒ వెంకటస్వామి తెలిపారు. ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. అడిగిన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉపాధి పథకం కింద 100 రోజులు పని కల్పించాలని ఆదేశించారు. రికార్డులు సక్రమంగా అమలు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ కొసన సత్యనారాయణ, ఏపిఒ రమేష్ పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎక్సైజు ఎసి కె విజయ

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నగరం

ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమీషనర్ కె విజయ స్థానిక స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డ్స్ పరిశిలించారు. స్టేషన్‌లో ఇప్పటివరకు బుక్ చేసిన కేసుల వివరాలు స్థానిక ఇన్స్పెక్టర్ మార్టురి శ్రీరామ్ ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. నూతన మద్యం విధానం అమలులోకి వచ్చినపటి 58 బెల్ట్ షాపులపై కేసులు నమోదు చేసి 515 బాటిల్స్ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 6 నాటు సార కేసులు నమోదు చేసి 36.5 లీటర్ల నాటు సార సీజ్ చేసినట్లు తెలిపారు. ఆయా కేసుల్లో 6 గురిని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. 58 బెల్లం ఊట కేసులు నమోదు చేసి 9200 లీటర్ల బెల్లం ఊట ద్వంసం చేశామని తెలిపారు. బహిరంగంగా మద్యం తాగుతున్న 18 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. 70 కల్లు శాంపిల్స్ తీశామని తెలిపారు. నాటుసారాపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఒంగోలు ఎసి కె విజయ మాట్లాడుతూ పెండింగ్ ఇన్వెస్టిగేషన్, ట్రైల్, ఎన్‌బిడబ్ల్యు, లోక్ ఆదాలత్ కేసులను పరిశిలించి క్లియర్ చేయాలని ఆదేశించారు. షాపులను పరిశీలించారు. నిబంధనలు పాటించాలని సూచించారు.

ప్రజాశక్తి 7
శనివారం 13 సెప్టెంబర్ 2025


ఆధార్ అందజేస్తున్న యానాదుల యూత్ చౌటూరి రమేష్

యానాదులకు ఆధార్ కార్డులు అందజేత

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ఆధార్ కార్డులు లేక బడికి వెళ్లాల్సిన పిల్లలు రోడ్డు వెంబడి గుడిసెల్లో జీవనం సాగిస్తున్న యానాదుల కుటుంబాలకు ఆధార్ కార్డులు పంపిణీ చేశారు. మండలంలోని ఆరుంబాక గ్రామంలో రోడ్డు వెంబడి చెట్ల కింద జీవనం సాగిస్తున్న యానాదుల కుటుంబాలకు ఆధార్ కార్డులు లేవని, నిస్సహాయ స్థితిలో జీవనం కొనసాగిస్తున్నారని తెలుసుకొని యానాదుల గిరిజన యూత్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చౌటూరీ రమేష్ మీడియా ద్వారా తెలిపారు. వెంటనే స్పందించిన కలెక్టర్ జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆదార్ శిభిరాలు ఏర్పాటు చేశారు. కొమరగిరి సుబ్బారావు కుటుంబానికి శుక్రవారం ఆధార్ కార్డు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు యందేటి వెంకటసుబ్బయ్య, ఎంఇఒ టి నవీన్ కుమార్, బాపూజీ, నాగపుష్పజా, రాసంశెట్టి నాగంజనేయులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందిస్తున్న శ్రీకాంత్

హోంగార్డు కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - బాపట్ల

అనారోగ్య సమస్యతో పాటు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న హెూంగార్డ్ శ్రీనివాసరావు కుటుంబానికి జిల్లా హెూంగార్డ్స్ రిజర్వ్ ఇన్ స్పెక్టర్ శ్రీకాంత్ ఆర్థిక సహాయం అందించారు. ఇబ్బందుల్లో ఉన్న హెూంగార్డు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

బాలికల పట్ల వివక్షత తగదు

ప్రజాశక్తి - పర్చూరు

సమాజంలో తల్లిదండ్రులు బాలికల పట్ల వివక్షత చూపించవద్దని సిడిపిఓ జి సుభద్ర తెలిపారు. మిషన్ శక్తి సంకల్ప 10 రోజుల అవగాహన ముగింపు సందర్భంగా ఆమె మాట్లాడారు. బాలికలకు మంచి విద్య అందించాలని చెప్పారు. మిషన్ శక్తి సంకల్పం బేటి పడావో బేటి బచావో ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. బాలికలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. బాలికలకు స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం నిర్వహించాలని చెప్పారు.

పేదలను రోడ్డుపైకి నెట్టే ప్రయత్నం

ప్రజాశక్తి - వేటపాలెం

పేదలను రోడ్డు మీదకు నెట్టివేయాలని రైల్వే శాఖ ప్రయత్నిస్తోందని బిఎస్పి ఇన్చార్జి చిట్టిమల సంగీతరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్లను కూల్చేయమని మాత్రమే నోటీసులు ఇవ్వడం ప్రభుత్వం వైఫల్యమని అన్నారు. ప్రత్యామ్నాయం చూపకుండా నిరుపేదల గూడు ధ్వంసం చేస్తే అది మానవత్వానికి విరుద్ధమని అన్నారు. ప్రభుత్వం వెంటనే భూమి కేటాయించి పేదల జీవన హక్కు కాపాడాలని కోరారు. బిఎస్పి మహిళా అధ్యక్షురాలు కటారి లలితదేవి, అద్దంకి శివప్రసాద్, అద్దంకి ఆదిలక్ష్మి, శామ్యూల్ పాల్గొన్నారు.

16, 17 తేదీల్లో ఆటల పోటీలు

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని చవిటిపాలెం జెడ్పి ఉన్నత పాఠశాలలో ఈనెల 16, 17 తేదీల్లో స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాల, బాలికలకు అండర్ 14, అండర్ 17 ఆటల పోటీలు జరుగుతాయని పాఠశాల హెచ్ఎం డి డేవిడ్, స్కూల్ గేమ్స్ కో ఆర్డినేటర్ పేరం శ్రీనివాసరావు తెలిపారు. పోటీలకు ముందుగా పరుగు పందాలు నిర్వహిస్తామని అన్నారు. కోకో, కబడి, వాలీబాల్, బ్యాట్ మెంట్, సెస్, యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి ఉద్యోగులు పాటుపడాలి

ప్రజాశక్తి - బాపట్ల

ప్రభుత్వ ఉద్యోగులు నైపుణ్యాలతో క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ కమిషనర్ ఆర్ ముత్యాలరాజు అన్నారు. బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న ఎంపిడిఒలు, డిప్యూటీ ఎంపిడిఒల శిక్షణలో ఆయన మాట్లాడారు. విధులు నిర్వర్తించే ప్రతి దశలోనూ సవాళ్లు ఎదురవుతాయని అన్నారు. వాటిని సమర్ధవంతంగా ఎదుర్కొని పరిష్కరించ గలిగితేనే ఉద్యోగ బాధ్యతలకు అర్ధం ఉంటుందని అన్నారు. ఏ వనరులు లేని ప్రజలకు, ప్రభుత్వ ఉద్యోగుల సహాయం, అవసరం ఉన్నవారికి, గుర్తింపు నోచుకోని వారికి ప్రభుత్వ సేవలు అందజేయడంలోనే నిజమైన సంతృప్తి ఉంటుందన్నారు. శిక్షణ ద్వారా పరిపాలన నియమావళిపై స్పష్టంగా అవగాహన పెంపొందించుకొని మార్పులతో కూడిన మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఇటిసి ప్రిన్సిపల్ డి వెంకటరావు, ప్రొఫెసర్ ఎస్ వరప్రసాద్, గుంటూరు జడ్పి సిఇఒ జ్యోతి బసు, పల్నాడు జిల్లా డిపిఓ ఎస్వి నాగేశ్వర నాయక్, బాపట్ల పిడి డిఆర్డిఎ కె శ్రీనివాసరావు, ఇటిసి వైస్ ప్రిన్సిపల్ పి పద్మజ, డిడిఒ సిహెచ్ విజయలక్ష్మి, ఎపిడి డ్వామా బి సింగయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముత్యాల రాజు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

ప్రజాశక్తి - బాపట్ల

రానున్న శాసనసభ సమావేశంలో బీసీ రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టాలని అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే శాసనసభ సమావేశాల్లో స్థానిక సంస్థల ఎన్నికలల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం తరహాలో డెటికేషన్ కమిషన్ ఏర్పాటు చేసి ఎపిలో ఎన్టీఆర్ ఆశయ సాధనకు ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్లు ఖరారు చేశాకే ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. బీసీలు ఎస్సీ, ఎస్టీలపై సామూహిక దాడులు, సాంఘిక బహిష్కరణలకు పాల్పడినా ఆయా చట్టాలు అమలు అయ్యేలా బీసీ సామాజిక రక్షణ చట్టం రూపకల్పన చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆవుల వెంకటేశ్వర్లు, ఓబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నవ సుబ్బారావు, పేరయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

కార్పొరేట్లకు కట్టబెట్టాలని చూస్తే ఉద్యమిస్తాం

ప్రజాశక్తి - బాపట్ల

వైద్య కళాశాలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని చూస్తే ఊరుకునేది లేదని మాజీ శాసన సభ్యులు కోన రఘుపతి ధ్వజమెత్తారు. వైసిపి కార్యాలయం నుండి మెడికల్ కళాశాలకు ద్విచక్ర వాహనాలతో నిరసన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మొదటి నుంచి విద్య, వైద్యాన్ని ప్రైవేటు పరం చేయాలని కంకణం కట్టుకొని పని చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 17నెలల్లో 13నెలల నుండే ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో వైద్య కళాశాలను తన అనుయాయులకు కట్టబెట్టేందుకు పన్నాగం పన్నుతున్నారని అన్నారు. రూ.550 కోట్లుతో నిర్మాణానికి జగన్మోహన్ రెడ్డి ముందుకు వచ్చారని అన్నారు. ఇప్పటికే రూ.82కోట్లు ఖర్చుపెట్టి పనులు చేపట్టారని అన్నారు. 20 అడుగులలోతు నుంచి కాంక్రిట్ వేసుకుంటూ నిర్మాణం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు, మరుప్రోలు ఏడుకొండలరెడ్డి, ఉయ్యూరు లీలాశ్రీనివా సరెడ్డి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు. నాయకులు కొక్కిలిగడ్డ చెంచయ్య, కోకి రాఘవరెడ్డి, గవిని కృష్ణమూర్తి, దొంతిరెడ్డి సీతారామిరెడ్డి, మండే విజయ్ కుమార్, ఇనగలూరి మాల్యాద్రి, గంగిశెట్టి రత్తయ్య, వడ్డిముక్కల డేవిడ్, రాజశేఖర్, నక్కా వీరారెడ్డి పాల్గొన్నారు.


మెడికల్ కళాశాల వద్ద వైసీపీ నాయకుల నిరసన

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని ఏల్చూరు ఎస్సీ కాలనీకి చెందిన యువకుడు పల్లెపోగు విజయ్ బాబు (19) శనివారం సాయంత్రం పల్నాడు జిల్లా ఉప్పలపాడు వద్ద గుంటూరు, కర్నూలు రహదారిపై మోటార్ సైకిల్పై వెళుతూ ముందు వెలుతున్న లారీని తప్పించబోయి లారీని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. నర్సరావుపేటలోని బసవ తారక రామారావు డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ప్రతిరోజు ఏల్చూరు నుండి బస్సు పాస్తో కాలేజీకి వెళ్లేవాడు. ఈరోజు మోటార్ సైకిల్పై కాలేజీకి వెళ్లి తిరుగు ప్రయాణంలో ప్రమాదంకు గురయ్యాడు. విజయ్ బాబు తండ్రి ఆశీర్వాదం తాపీ పనులకు చెన్నై వెళ్లారు. ఏల్చూరులో నాయనమ్మ దగ్గర ఉంటూ కాలేజీకి వెలుతున్నాడు. ప్రమాదానికి గురైన మోటార్ సైకిల్ నుజ్జునుజ్జు అయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో ఎస్సీ కాలనీలో విషాదఛాయలు అమ్ముకున్నాయి.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - రేపల్లె

వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మునిసిపల్ కమీషనర్ కె సాంబశివరావు తెలిపారు. ఫ్రై డే – డ్రై డే సందర్భంగా నేతాజీ మునిసిపల్ హైస్కూలులోని విద్యార్థినీ, విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరి ఇన్స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, హెచ్ఎం పి నాగమ్మ, ఎం ప్రవీణ పాల్గొన్నారు.

15 నుండి క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - బాపట్ల

పాఠశాల విద్యార్థులను క్రీడలపట్ల ప్రోత్సహించేందుకు స్కూల్ గేమ్ ఫెడరేషన్ మండల స్థాయి ఆటల పోటీలు ఈనెల 15 నుండి ప్రారంభమవుతాయని ఎంఈఓ డి ప్రసాదరావు తెలిపారు. స్థానిక విద్యా వనరుల కేంద్రంలో క్రీడా కారుల ఎంపిక నిర్వహణపై వ్యాయామ ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలురు, బాలికలకు అథ్లెటిక్స్ మున్సిపల్ హైస్కూల్లో జరుగుతాయని తెలిపారు. సమావేశంలో పిఇటి కత్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


నిత్యవసర వస్తువులు పంపిణీ చేసిన దాతలు

నిత్యావసర వస్తువులు పంపిణీ

ప్రజాశక్తి - పర్చూరు

గ్రామంలోని ఆశ్రయ వృద్ధాశ్రమం నందు తులాబంధుల అర్జునయ్య ధర్మపత్ని అనసూయమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు నిత్య అవసరాల నిమిత్తం ఈ నెలకు సరిపడు రూ.15 వేల విలువైన 250 కేజీల బియ్యం అందజేశారు. నిర్వాహకుల తరపున భవనం శ్రీనివాసరెడ్డి, జయలక్ష్మి దంపతులు, ఆశ్రమ సూపరింటెండెంట్ శ్రీ సాయి కృతజ్ఞతలు తెలిపారు.

షంషుద్దీన్కు మాతృవియోగం

ప్రజాశక్తి - పర్చూరు

ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్ మాతృమూర్తి షేక్ రెహానబి శుక్రవారం మృతి చెందారు. ఆమె మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సంతాపం తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె మరణం చాలా బాధాకరమని అన్నారు. షంషుద్దీన్తో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఫోన్లో పరామర్శించారు.

రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండల కేంద్రమైన ఇంకొల్లు, పావులూరు రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో శుక్రవారం సాయంత్రం ఊడల మర్రిచెట్టు రోడ్డు వైపు ఉన్న పెద్ద కొమ్మ విరిగి పోవడంతో రోడ్డుపై పడింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో నష్టం జరగలేదు. స్థానికులు పంచాయితీ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వచ్చి కొమ్మను తొలగించి వాహన రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు.

సర్వే పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని గ్రామాల్లో చేపట్టిన సమిత్వ సర్వే పూర్తి చేయాలని ఇంచార్జ్ ఎంపిడిఒ వెంకటస్వామి ఆదేశించారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లకు శిక్షణ నిర్వహించారు. సమావేశంలో ఈఒపిఆర్డి కోసన త్యనారాయణ పాల్గొన్నారు.

చిన్నపులివర్రులో ఎరువులు పంపిణీ

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని చినపులివర్రు రైతు సేవా కేంద్రం నందు 270 బస్తాల యూరియా, 200 బస్తాల డిఎపిని ఎఒ వి నరేంద్రబాబు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కావాల్సినంత ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని అన్నారు.

విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి - పంగులూరు

కొరిసపాడు మండలం దైవాల రావూరులో కిరణ్ జ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సైన్స్ ఫెయిర్లో పంగులూరు మండలానికి చెందిన విద్యార్థులు మూడు ప్రథమ స్థానాలు సాధించారు. వీరిలో పంగులూరు జెడ్పి ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని నూతలపాటి అల్పిత, బూధవాడ జెడ్పి ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు సిరి చందన, రూపశ్రీ, 8వ తరగతికి చెందిన హరిని, సుమశ్రీ ప్రథమ స్థానం సాధించారు. ఇందుకు సంబంధించి రూ.4500 నగదు బహుమతితో పాటు, షీల్డ్ బహుకరించినట్లు ఆ పాఠశాల హెచ్ఎంలు సోమేపల్లి శ్రీనివాసరావు, పూసల రఘురామయ్య తెలిపారు. పోటీల్లో 22 పాఠశాలలు పాల్గొనగా 52 అంశాలపై సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఐదు మొదటి బహుమతులు ప్రకటించగా అందులో మూడు ప్రథమ బహుమతులు పంగులూరు మండలానికి రావడం అభినందనీయమని అన్నారు. పంగులూరు పాఠశాలకు భాస్కర మూర్తి గైడ్గా వ్యవహరించగా బూదవాడ పాఠశాలకు పెట్లూరి శ్రీనివాసరావు గైడ్గా వ్యవహరించారు. విద్యార్థులను అభినందించారు.

జడ్పీ సమావేశానికి

మంత్రుల డుమ్మా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక జడ్పీ సర్వసభ్య సమావేశానికి ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన రాష్ట్ర విద్యుత్ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి డుమ్మా కొట్టారు. ఇద్దరు మంత్రులు వారి నియోజకవర్గాలలో అందుబాటులో ఉన్నా సమావేశానికి హాజరు కాకపోవటం గమనార్హం. ఢిల్లీలో ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారంలో పాల్గొనటంతో సమావేశానికి హాజరు కావటం లేదని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి సమాచారం పంపారు. మంత్రులతో పాటు జిల్లాకు చెందిన టిడిపి ఎమ్మెల్యేలు సైతం గైర్హాజరు కావటం సమావేశంలో చర్చనీయాంశమైంది. మంత్రులు జడ్పీ సమావేశానికి రాకపోతే ప్రజా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని జడ్పీటిసిలు, ఎంపిపిలు ఆవేదన వ్యక్తం చేశారు.

జడ్పీ సమావేశానికి తెలుగుదేశం పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టడం చర్చకు దారితీసింది. పాత జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన శుక్రవారం జడ్పీ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి జిల్లాకు చెందిన మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ డిబివి స్వామి గైర్హాజరు అయ్యారు. గురువారం సాయంత్రమే ఇద్దరు మంత్రులు జడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరవుతారని షెడ్యూల్ వచ్చింది. శుక్రవారం ఇద్దరు మంత్రులు వారి నియోజకవర్గాలలో అందుబాటులో ఉన్నారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ జె.పంగులూరు మండలం బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు సైకిళ్ళ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమం, వయోవృద్ధులు, వికలాంగులు, సచివాలయాలు, వాలంటీర్ల శాఖ మంత్రి డిబివి స్వామి నియోజకవర్గంలో అందుబాటులోనే ఉన్నారు. అయినా ఇద్దరు మంత్రులు జడ్పీ సమావేశానికి డుమ్మా కొట్టడం గమనార్హం. అలాగే ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు ఒంగోలులోనే అందుబాటులో ఉన్నారు. టిడిపి కార్యాలయంలో ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే దామచర్ల హాజరయ్యారు. మార్కాపురం, గిద్దలూరు, సంతనూతలపాడు, కనిగిరి ఎమ్మెల్యేలు సైతం జడ్పీ సమావేశానికి గైర్హాజరయ్యారు. మంత్రులు, టిడిపి ఎమ్మెల్యేలు చర్చించుకొని జడ్పీ సర్వసభ్య సమావేశానికి డుమ్మా కొట్టారని విశ్వసనీయ సమాచారం. దీంతో ప్రజా సమస్యలపై సమాధానాలు చెప్పలేక మంత్రులతో పాటు టిడిపి ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారని వైసిపికి చెందిన దర్శి, యర్రగొండపాలెం ఎమ్మెల్యేలు బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్ ఆరోపించారు. తమ నియోజకవర్గాలలో మంత్రులకు సంబంధించిన సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని వారు ప్రశ్నించారు. అదేవిధంగా పలువురు జడ్పీటిసిలు, ఎంపిపిలు సైతం మండలాలలో నెలకొన్న సమస్యలు జిల్లా అధికారులు పరిష్కరించటం లేదని, మంత్రులకు చెప్పుకుందామంటే వారు గైర్హాజరయ్యారని, తమ గోడు ఎవరికి పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జడ్పీ సర్వసభ్య సమావేశానికి మంత్రులు, టిడిపి ఎమ్మెల్యేలు గైర్హాజరు కావటం చర్చకు దారితీసింది.



దామచర్లకు సమస్యను విన్నవిస్తున్న ఆర్పీలు

ఎమ్మెల్యే దామచర్లకు వినతుల వెల్లువ

- సమస్యలు పరిష్కరించాలని ప్రజల వినతి
- న్యాయం చేయాలని ఆర్‌పీల వేడుకోలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

తమ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావుకు వినతిపత్రాలు అందజేశారు. పలు సమస్యలపై నియోజకవర్గ ప్రజలు ఒంగోలు టిడిపి కార్యాలయం ఎన్టీఆర్ భవన్ వద్దకు రావటంతో శుక్రవారం సందడి నెలకొంది. ప్రధానంగా ఇళ్ళ స్థలాలు, రుణాలు ఇప్పించాలని, టిడ్కో ఇళ్ళు మంజూరు చేయాలని, ఉద్యోగ అవకాశాలు కల్పించాలి వంటి సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దామచర్లకు విన్నవించి పరిష్కరించాలని కోరారు. ఆయా సమస్యలపై సంబంధిత శాఖల అధికారులకు రాయటంతో పాటు ఎమ్మెల్యే దామచర్ల పలువురు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

న్యాయం చేయాలని ఆర్‌పిల వేడుకోలు

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావును ఒంగోలు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లో రిసోర్స్‌పర్సన్‌గా పనిచేస్తున్న మహిళలు కలిసి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. మెప్మా ఆధ్వర్యంలో 2020లో ఒంగోలులో మహిళా మార్ట్ ఏర్పాటు చేసేందుకు రిసోర్స్‌పర్సన్‌కు నుంచి డబ్బులు వసూలు చేశారని, నేటికి వాటిని ఇవ్వలేదని మహిళలు వాపోయారు తమకు రావాల్సిన డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని ఎమ్మెల్యేను వారు కోరారు. స్పందించిన దామచర్ల ఈ విషయమై చర్యలు తీసుకోవాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీహరిని ఆదేశించారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అధ్యక్షులు బండారు మదన్ పాల్గొన్నారు.

అంగన్వాడీ రాష్ట్ర మహాసభలను

జయప్రదం చేయండి

మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ



మాట్లాడుతున్న కారుసాల సుబ్బరావమ్మ

ఈ నెల 20,21తేదీల్లో ఒంగోలులో తొలిసారిగా జరిగే అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ 11 వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘ రాష్ట్ర నాయకత్వం విజ్ఞప్తి చేసింది. శుక్రవారం నాడు ఒంగోలు సీఐటీయూ జిల్లా కార్యాలయం లో జరిగిన మీడియా సమావేశంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుసాల సుబ్బరావమ్మ, సిఐటియు రాష్ట్రకార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు మాట్లాడారు. ఐసిడిఎస్ ఏర్పడి 50 ఏళ్ళు పూర్తై స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో ఆ రంగంలో పనిచేస్తున్న అంగన్వాడీలు, హెల్పర్లకు ఉద్యోగ భద్రతకు నోచుకోని పరిస్థితిలో నిర్లక్ష్యం చేయబడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజులపాటు ఒంగోలు లోని కాపు కల్యాణమండపంలో జరిగే సభలలో అంగన్వాడీల సమస్యలను చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మానవ అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్న ఐసిడిఎస్ వ్యవస్థను కేంద్రం నిర్వీర్యం చేస్తుందని దుయ్యబట్టారు. రాబోయే కాలంలో అంగన్వాడీల పరిరక్షణ, అభివృద్ధికి బడ్జెట్ కేటాయింపులు సాధించడానికి ప్రభుత్వం పై వత్తిడి తెచ్చే దిశగా సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలను సింగపూర్, గుజరాత్ నమూనా గా మార్చాలన్న మోడీ పిలుపు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గుజరాత్ లో అంగన్వాడీలను మూడో తరగతి ఉద్యోగులుగా, వర్కర్లను నాలుగో తరగతి ఉద్యోగులుగా అమలు చేస్తున్నారని, అదే చట్టాన్ని ఇక్కడ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సంఘ గౌరవాధ్యక్షులు ఎం రమేష్ మాట్లాడుతూ ఆరేళ్ళలోపు పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు వెళ్ళ నీయకుండా నిరోధించాలని, వారిని అంగన్వాడీ కేంద్రాలకు పంపేవిధంగా చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహాసభల వాల్ పోస్టర్ ను నాయకులు ఆవిష్కరించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, అంగన్వాడీ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శులు ఎన్ ధనలక్ష్మి, బి శేషమ్మ, కె మున్నా, కోశాధికారి కె వి సుబ్బమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ బస్సులు ఆర్టీసీనే నడపాలి

ఆర్టీసీ పరిరక్షణ దినంలో ఎస్‌డబ్ల్యూఎఫ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



నిరసన కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యుత్ బస్సుల జిసిసి (జీసీసీ) విధానాన్ని రద్దు చేయాలని, విద్యుత్ బస్సులు నేరుగా ఆర్టీసీ యాజమాన్యం నడపేలా పాలసీని మార్చాలని డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు అఖిలభారత రోడ్డు రవాణా వర్కర్స్ ఫెడరేషన్(ఏఐఆర్ టిడబ్ల్యూఎఫ్) పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళన లో భాగంగా స్టాఫ్ అండ్ ఫెడరేషన్ (ఎస్ డబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో ఒంగోలు ఆర్టీసీ డిపోగేరేజ్ ఎదుట ఆర్టీసీ పరిరక్షణ ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఎం అయ్యప్ప రెడ్డి, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు, జోనల్ ఉపాధ్యక్షులు అల్లడి సుబ్బారావు,ఒంగోలు డిపో నాయకులు, సీఐటీయూ నగర కో కన్వీనర్ బీవీ రావు మాట్లాడారు.ప్రభుత్వం తలపెట్టిన విద్యుత్ బస్సుల విధానం కారణంగా ఆర్టీసీ సంస్థ ప్రైవేట్ యజమానుల పాలు అవుతాయని, ఈ విధానం కొనసాగితే ఆర్టీసి భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని నాయకులు హెచ్చరించారు. ఆర్టీసీ వ్యవస్థ ఉనికిని కోల్పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీని కాపాడుకోవడం, విద్యుత్ బస్సుల పాలసీని మార్చించడం అనేది కేవలం ఉద్యోగుల సమస్య మాత్రమే కాదని, ఇది ప్రజారవాణా వ్యవస్థను రక్షించే పోరాటమని నాయకులు స్పష్టం చేశారు. కేంద్ర విద్యుత్ బస్సుల జిసిసి విధానం రద్దు చేయాలనివిద్యుత్ బస్సులను నేరుగా ఆర్టీసీలే నడపేలా పాలసీ మార్పు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జి శేషయ్య సంగిభావం వ్యక్తం చేశారు. జిల్లా ప్రచారకార్యదర్శి యస్ కె మీరావలి, బాపట్ల వెంకట్రావు, డిపో కార్యదర్శి యు.హరిబాబు, డిపో అధ్యక్షుడు యు.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించేందుకు కృషి

మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-పంగులూరు



సైకిళ్లు అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి

'ఈ ప్రభుత్వం ఎలా పనిచేస్తుంది? విద్యార్థులకు సౌకర్యాలని అందుతున్నాయా?' అంటూ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బూదవాడ ఉన్నత పాఠశాల విద్యార్థులను ప్రశ్నించారు. 'ఈ ప్రభుత్వం బాగానే పనిచేస్తుంది, మాకు అన్ని సౌకర్యాలు అందుతున్నాయి' అని విద్యార్థులు మంత్రికి సమాధానం చెప్పారు. మండలంలోని బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ టు విద్యార్థులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ 210 సైకిల్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ డిసెంబర్ జనవరిలోపు నియోజకవర్గం లోని అన్ని పాఠశాలల విద్యార్థులకు సైకిళ్ళు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. త్వరలో కొండ మంజులూరు పాఠశాలకు సైకిళు అందజేస్తామని రవికుమార్ హామీ ఇచ్చారు. ఇప్పటివరకు బూదవాడ పాఠశాలకు తల్లిదండ్రులు వచ్చి వదిలిపెట్టడం గానీ, బస్సులో రావడం గానీ, నడిచి రావడం గానీ జరుగుతుందని ఈ ఇబ్బంది లేకుండా ఇక నుండి ప్రతి విద్యార్థి సైకిల్‌పై పాఠశాలకు రావాలని, సైకిల్ మీద వచ్చేటప్పుడు ఎంతో జాగ్రత్తగా రావాలని చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంతోషంగా రావాలని, నడిచి వచ్చే వాళ్లకు సైకిల్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. 10వ తరగతిలో ఉన్న 40 మంది విద్యార్థులను పలకరించారు. ఎలా చదువుతున్నారని అడిగారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలనే ఆలోచనలో ఉన్నారని అన్నారు. ఆయన ఆలోచన కనుగొనంగా విద్యార్థులు బాగా చదువుకొని మంచి ఫలితాలు తీసుకురావాలని కోరారు. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన పి4 పథకం ద్వారా ధనవంతులైన వారు పేదలకు చేయూతనందించి వారి సమస్యలు పరిష్కరించి వారికి సహకరించాలని కోరారు. పాఠశాల హెచ్ఎం పూసల రఘురామయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు సైకిల్ విషయంలో జాగ్రత్తలు చెప్పాలని కోరారు. పిల్లలు సైకిళ్లను జాగ్రత్తగా నడిపితే ఏ సమస్య ఉండదని అన్నారు. విద్యార్థులు పెద్దలు ఇచ్చిన ఈ సైకిల్‌ను ఉపయోగించుకొని సమయాన్ని అనుకూలంగా మలుచుకుని బాగా చదువుకోవాలని చెప్పారు. జీవితంలో పైకొచ్చి ఇంకొంతమందికి సహాయపడాలని కోరారు. అసిస్టు అసోసియేట్ డైరెక్టర్ విష్ణు ప్రియ మాట్లాడుతూ విద్యార్థులంతా చక్కగా చదువుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం విద్యార్థులకు సైకిల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దారు పి సింగారావు, ఎంపిడిఒ స్వరూపరాణి, ఈఓఆర్‌డి సుమంత్, ఎపిఒ సంతోషమ్మ, ఎపిఎం కోటేశ్వరరావు, ఎఒ సుబ్బారెడ్డి, పిఆర్ ఎఈ హనుమంతరావు, ఎలక్ట్రిసిటీ డిఈ మస్తాన్‌రావు, టిడిపి మండల అధ్యక్షులు రావూరి రమేష్ బాబు, నాయకులు కరి వెంకట సుబ్బారావు, కుక్క పల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.